

అల్లూరు : సురక్షిత ప్రాంతానికి చేరుకున్న బోట్లు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 1 డిసెంబరు 2024



ముందుకు వచ్చిన సముద్రం

ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో శనివారం కృష్ణపట్నం వద్ద సముద్రం 20 అడుగులు ముందుకు వచ్చింది. సముద్రంలో కూడా అలజడి ఎక్కువగానే ఉంది. తీర గ్రామాల్లో తహసీల్దారు బాలకృష్ణారెడ్డి పర్యటించి పరిస్థితులను సమీక్షించి, వీఆర్‌వోలను అప్రమత్తం చేశారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని, వలలను, బోట్లను సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకోవాలని తెలిపారు.

6వ నెంబరు ప్రమాద హెచ్చరిక

ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి): తుఫాన్ తీవ్రత పెరగడంతో కృష్ణపట్నం పోర్టులో శనివారం ఆరవ నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగరవేశా రు. తుఫాన్ తీరం దాటే సమయంలో తీవ్ర ప్రభావం ఉన్నప్పుడే ఈ హెచ్చరికను ఎగుర వేస్తారు. శనివారం రాత్రి తుఫాన్ దీరం దాటవచ్చని, ఆ సమయంలో తీరంలో 45 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయ ని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. తీరం దాటాక కూడా వర్షాలతోపాటు ఈదురు గాలులు ఉంటాయని హెచ్చరించారు.



ఫెంగల్ అలజడి

- సింహపురిని వణికిస్తున్న పెను తుఫాన్
- మోస్తరు నుంచి భారీ వర్షం
- జిల్లా యంత్రాంగం అప్రమత్తం
- తీరప్రాంతాల్లో వణుకు
- రెవెన్యూ అధికారులకు కలెక్టర్ కీలక ఆదేశాలు
- 24 గంటలూ అందుబాటులో ఉండేలా చర్యలు

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుఫాన్ జిల్లాను వణికిస్తోంది. ఈ తుఫాన్ ప్రభావంతో శనివారం జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తూనే ఉంది. జిల్లా సగటు వర్షపాతం 10.1 మిల్లీమీటర్లు నమోదవగా, అత్యధికంగా ఇందుకూరుపేటలో 42.8, అత్యల్పంగా వింజమూరు, మర్రిపాడులలో 1.2 మి.మీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎడతెరపిలేని వర్షం కురవడంతో కాలువలు, రోడ్లు జలమయం అయ్యాయి. రోడ్లపై గుంతలలో నీరు చేరటంతో వాహన రాకపోకలకు తీవ్రఅంతరాయం ఏర్పడింది. వర్షానికితోడు చలితీవ్రత పెరగడంతో వృద్ధులు, పిల్లలు వణికిపోతున్నారు. కాగా, జిల్లాలోని సోమశిల, కండలేరు, రాళ్లపాడు తదితర ప్రధాన ప్రాజెక్టులతోపాటు నదులు, చెరువులకు నీరు వచ్చి చేరుతోంది. తుఫాన్ తీరం దాటినా దాని ప్రభావంతో ఆది, సోమవారాలలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

● అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. శనివారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం సోమశిల ప్రాజెక్టులో ఔట్‌ఫ్లో, ఇన్‌ఫ్లో సమానంగానే ఉన్నాయని తెలిపారు. అన్నమయ్య జిల్లా నుంచి సోమశిల జలాశయానికి వరద ప్రవాహం పెరిగితే పరిస్థితిని బట్టి నీటి విడుదలకు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. పెన్నా నది పరివాహక ప్రాంతాల్లో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు కూడా ప్రజలను జాగృతి చేస్తూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు సోమశిల నీటి ప్రవాహాన్ని అంచనావేస్తూ తదనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురైతే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. తీరప్రాంత గ్రామాలు, పెన్నా పరివాహక ప్రాంతాల పరిధిలోని మండలాల్లో కంట్రోల్ రూములు రాత్రిపూట కూడా పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు తుఫాన్ ప్రభావం వల్ల జిల్లాలో ఎలాంటి నష్టం వాటిల్లలేదని పేర్కొన్నారు.

● 'సోమశిల'కు ఇన్‌ఫ్లో

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 6,050 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 69.435 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కండలేరుకు 6,000, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 100 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. కండలేరు డ్యాంకూ వరద కొనసాగుతోంది.

పోలీసు, అగ్నిమాపకం సన్నద్ధం

నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం పోలీస్, అగ్నిమాపక దళం సన్నద్ధమవుతోంది. పోలీసు సిబ్బంది 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటారని, అగ్నిమాపక సిబ్బందితో ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని ఆయా శాఖల అధికారులు ప్రకటించారు.

● 24 గంటలు అందుబాటులో : ఎస్పీ

జిల్లా పోలీసు సబ్ డివిజన్‌హెడ్ క్వార్టర్స్‌లో సహాయక చర్యలు కోసం 24 గంటలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక పోలీసు బృందాలను సిద్ధం చేశామని ఎస్పీ జి కృష్ణకాంత్ తెలిపారు. పరిస్థితులను బట్టి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెవెన్యూ ఇతర శాఖల సమన్వయంతో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో వంకలు, వాగులు, లోతట్టు ప్రాంతాల్లో నివసించు ప్రజలను అప్రమత్తం చేయాలని పోలీసులకు సూచించారు. గాలులు వీస్తున్న నేపథ్యంలో పూరిల్లు, రేకుల షెడ్లలలో నివశించే వారిని గుర్తించి అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ప్రజలు అత్యవసర పరిస్థితులు తలెత్తితే 112, వాట్సప్ నెంబరుకు 9392903413 సమాచారం ఇవ్వాలని సూచించారు.

● ఆరు ప్రత్యేక బృందాలు : డీఎఫ్‌వో

ఫెంగల్ తుపాన్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఆరు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశామని, బోట్ నడిపేందుకు రెండు టీమ్‌లు, ఉడ్‌కటింగ్‌కు రెండు టీమ్‌లు, రిస్క్యూ ఆపరేషన్‌కు రెండు టీమ్‌లు సిద్ధంగా ఉన్నారని డీఎఫ్‌వో వి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఫైర్ స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సెలవులు రద్దు చేశామని, ఎలాంటి విపత్తులు వచ్చినా ప్రజలను కాపాడేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.



నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలవడంతో వాహనదారుల అవస్థలు



తోటపల్లిగూడూరు : కొత్తపాళెంలో నీటమునిగిన నారుమళ్లు



నెల్లూరు పొదలకూరు రోడ్డులోని ఎస్పీ కార్యాలయం వద్ద నిలిచిన వాన నీరు

8 నెలలు 500 కేసులు

- సగటున నెలకు 60 పాజిటీవ్‌లు
- చాపకిందనీరులా విస్తరిస్తున్న హెచ్‌ఐవీ
- నియంత్రణలో జిల్లాకు 8వ స్థానం
- నేడు ప్రపంచ ఎయిడ్స్ దినం

నిశ్శబ్దంగా మనిషిలోని రోగ నిరోధక శక్తిని హరింపజేసి, ప్రాణాలకే ముప్పుతెచ్చే హెచ్‌ఐవీ చాపకింద నీరులా వ్యాపిస్తోంది. గడిచిన ఎనిమిది నెలల కాలంలో 500 కేసులు రికార్డుల్లోకి ఎక్కాయి. అంటే నెల 60 కొత్త కేసులు నమోదవుతున్నా యన్నమాట. ఇది ఆందోళన కలిగించే అంశమే అయినా నియంత్రణలో వైద్య ఆరోగ్య శాఖ చేతులెత్తేస్తోందన్న అపవాదు నెలకొంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను స్వచ్ఛంద సంస్థలకు మళ్లిస్తున్న అధికారులు వాటిపనితీరుపై మాత్రం పర్యవేక్షణ లేకుండా పోతోంది. మరోవైపు జిల్లాలో కేవలం 2202 మందికి పింఛన్ అందుతుండగా, 5వేల మందికిపైగా దరఖాస్తు చేసుకుని ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఒక కొత్త పెన్షన్ కూడా మంజూరు చేయకపోవడంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వంపైనే బాధితులు ఆశలు పెట్టుకుని ఉన్నారు.



6

పొగాకు, మినుము
రైతుల్లో ఆందోళన

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావంతో ఆదివారం భారీవర్షాలు కురిసే అవకాశం ఉందన్న సమాచారంతో పొగాకు, మినుములు సాగు చేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కందుకూరు ప్రాంతంలోని పొగాకు తోటలు రెలుపుల దశకు వచ్చాయని, వర్షం కురిస్తే బంక కారిపోయి బొగులు ఆకు వస్తుందని వాపోతున్నారు. అలాగే నల్లరేగడి నేలల్లో కూడా ఇటీవల పొగనారు కొని బురద నాట్లు వేసి ఉన్నారు. ఈ దశలో భారీవర్షాలు పడితే పొగనాట్లు దెబ్బతినటం ఖాయమని చెబుతున్నారు. అలాగే కందుకూరు ప్రాంతంలో మరో ప్రధాన పంటగా ఉన్న మినుము ఇటీవల వర్షాలకే స్వల్పంగా దెబ్బతింది. అప్పటికే పూత, పిందె దశలో ఉన్న మినుము వర్షాలకు పూత రాలిపోయి ఇప్పుడిప్పుడే తిరిగి ఇగుర్లు వచ్చి పూతలు వస్తున్నాయి. ఈ దశలో మళ్లీ భారీవర్షాలు కురిస్తే ఇక మినుముపై ఆశలు వదులుకోవాల్సిందే అని అదే జరిగితే పెట్టుబడులు కూడా అందవని రైతులు అంటున్నారు. శనగ సాగుకు కూడా అదను దాటిపోతుందని అదను దాటాక శనగ వేసినా ఆశించిన దిగుబడులు రావంటున్నారు. ఈ స్థితిలో ఈ తుఫాన్ మమ్మల్ని నష్టపెట్టడానికే వచ్చినట్లుందని రైతులు చర్చించుకుంటున్నారు.



కందుకూరు ప్రాంతంలో సాగుచేసి ఉన్న లేత పొగనాట్లు

ఏ పరిధి ఎవరిది?

- ఇరిగేషన్‌లో బౌండరీల గందరగోళం
- జాఫర్ సాహెబ్ కాలువ వెంబడి ఆక్రమణలు
- మంత్రి ఆదేశించినా తొలగింపులో సరిహద్దుల వివాదం

7

మైనింగ్ డీడీ చంద్రశేఖర్ సరెండర్

నెల్లూరు(వెంకటేశ్వరపురం), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మైనింగ్ శాఖ డీడీ చంద్రశేఖర్‌ను ఆ శాఖ రాష్ట్ర కార్యాలయానికి సరెండర్ చేస్తూ కలెక్టర్ ఓ ఆనంద్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సెప్టెంబరు 29న రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బదిలీల్లో ఏపీఎండీసీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎస్.చంద్రశేఖర్‌ను నెల్లూరు జిల్లా మైనింగ్‌శాఖ డీడీగా నియమించారు. అయితే విధుల్లో చేరినప్పటి నుంచి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిం చడంతో పలుమార్లు జిల్లా కలెక్టర్ మందలించారు. అయినా అతని పనితీరులో మార్పు రాకపోవడంతో ఆయనను రాష్ట్ర కార్యాలయానికి సరెండర్ చేస్తూ కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో కేవలం రెండు నెలలు మాత్రమే విధులు నిర్వహిం చిన చంద్రశేఖర్‌ను సరెండర్ చేయడంతో మైనింగ్‌శాఖ కొత్త డీడీ ఎవరన్నది ఇంకా స్పష్టత రాలేదు.

జైళ్ల శాఖలో బదిలీలు

నెల్లూరు (క్రైం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జైళ్ల శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేస్తూ శుక్రవారం రాత్రి జైళ్ల శాఖ డీజీ కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు కేంద్రకారాగార అదనపు సూపరింటెండెంట్ ఎ మహేష్ బాబును విశాఖ కేంద్ర కారాగారానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో విశాఖ కేంద్ర కారాగార అదనపు సూపరింటెండెంట్ ఎం వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. నెల్లూరు కేంద్ర కారాగార డిప్యూటీ సూపరింటెండెంట్ ఎన్ సాయిప్రవీణ్, కార్యాలయ సూపరింటెండెంట్ వి అప్పారావు విశాఖకు బదిలీ అయ్యారు. విశాఖ కేంద్ర కారాగారం కార్యాలయ సూపరింటెండెంట్ డి శరత్‌బాబు నెల్లూరుకు బదిలీ అయ్యారు.



ప్రాకారోత్సవంలో శివపార్వతుల ఉత్సవమూర్తులు

ముగిసిన కార్తీక సంబరం



నెల్లూరు నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వ రాలయంలో కార్తీక మాసోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. ఉదయం పాలాభిషేకాలు, మహా న్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. సాయంత్రం ఉత్సవమూర్తులు, ధ్వజస్తంభాలకు విశేష పుష్పాలంకారం జరిగింది. అనంతరం శివపార్వతులకు పుష్కరిణి చుట్టూ దీప హారతులతో ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం ఆకాశ దీపాన్ని (అవగతం) దించి పూజలు చేశారు. ఈ ఉత్సవాలకు ఉభయకర్తలుగా రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, శిరీష దంపతులు, అల్లూరు గిరీష్‌రెడ్డి, లత దంపతులు వ్యవహరించారు. భక్తులు జోరు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. తోటల్లో వనభోజనాలు, కార్తీక దీపారాధనలు చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో జే.శ్రీనివాసరావు, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

- నెల్లూరు(సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి)

కమనీయంగా పెంచులోకి కల్యాణం



పెంచలకోనలో నరసింహస్వామి కల్యాణం శనివారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, కల్యాణోత్సవం జరిపారు. సాయంత్రం 5.30 గంటలకు చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మీ సమేత నరసింహస్వామి వారికి తిరుచ్చి, పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు ఆలయం ముందు కోలాటం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఉపకమిషనర్, కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

- రాపూరు, (ఆంధ్రజ్యోతి)

రాళ్లపాడు కుడి, ఎడమ కాలువలకు

నీరు నిలుపుదల

లింగసముద్రం (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు నీటి సరఫరాను నిలుపుదల చేసినట్లు ప్రాజెక్టు ఏఈ జి.చంద్రమౌళి తెలిపారు. ప్రస్తుతం ఫెంగల్ తుఫాను ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో సాయంత్రం నాలుగు గంటల సమయంలో రెండు కాలువల తూములను దించివేసినట్లు చెప్పారు. ప్రస్తుతం కుడి కాలువ నుండి 60క్యూసెక్కులు, ఎడమ కాలువ నుండి 15క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్టు పేర్కొన్నారు. శుక్రవారం సోమశిల ప్రాజెక్టు నుండి 600 క్యూసెక్కుల నీరు విడుదల చేశారని, కానీ ఈ నీరు ప్రాజెక్టుకు వచ్చే సరికి మూడురోజులు పడుతుందని తెలిపారు.



వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి ఆంజనేయులు నాయక్

వరిని కాపాడుకోండిలా..

ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున వరి సాగు చేస్తున్న రైతులు సూచనలు, సలహాలు పాటించాలని ఉదయగిరి మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు నాయక్ పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంట ప్రస్తుతం కోత దశలో ఉండగా, రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పంట పిలక దశలో ఉంది.

- పొలంలో ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు తోడేయాలి. వరి నారు నాటిన తరువాత పిలకపెట్టే దశలో మూడు రోజుల వరకు ఆకులు పూర్తిగా నీటి మునిగిన కూడా తర్వాత నీటిని తీసివేస్తే మొక్క నిలదొక్కుకునే అవకాశం ఉంటుంది.
- ఎకరానికి 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ ఎరువులను పైపాటుగా వేయాలి.
- వరిలో పాము పొడ తెగులు ఉధృతి ఎక్కువగా అయ్యే అవకాశముంది. ఈ తెగులు నివారణకు ట్రోఫికోనజోల్ ఒక ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- ఆకాశం మేఘావృతమై తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున ఆకులై అగ్గి తెగులు సోకే అవకాశం ఉంది. దీని నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు ఒక లీటర్ నీటికి లేదా కాసుగామైసిన్ 2.5 ఎంఎల్ లీటర్‌లో కలిపి పిచికారీ చేయాలి.
- వరిలో వర్షాలు తగ్గిన తర్వాత ఆకు ముడత పురుగు ఆశించే అవకాశమున్నందున కార్టాప్ హైడ్రోక్లోరైడ్ అనే ముందును 2 గ్రాములు లీటరు నీటిలో కలిసి ఎకరాకు పిచికారీ చేయాలి.
- ముందుగా నాటిన వరి స్వల్పకాలిక రకాల్లో విత్తనం మొలకెత్త కుండా నిరోధించడానికి కోత దశలో ఉన్న వరిపై 5 శాతం ఉప్పు ద్రావణంతో పిచికారీ చేయాలి.
- వర్షాలకు పంటనష్టం జరిగితే గ్రామస్థాయిలో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులకు రైతులు సమాచారం అందించాలి.

8 నెలలు 500 కేసులు

- నగటున నెలకు 60 పాజిటివ్‌లు
- చాపకిందనీరులా విస్తరిస్తున్న హెచ్‌ఐవీ
- నియంత్రణలో జిల్లాకు 8వ స్థానం
- అధికారుల మెతకవైఖరే కారణమా!?
- స్వచ్ఛంద సంస్థల పనితీరుపై విమర్శలు
- 12,500 మంది బాధితులు.. 2202 మందికే పెన్షన్
- కొత్తగా ఒక పెన్షనూ మంజూరు చేయని నాటి వైసీపీ సర్కారు
- బస్సుపాసుల రద్దుతో ఆర్థిక భారం
- కూటమి ప్రభుత్వంపైనే అభాగ్యుల ఆశలు

నేడు ప్రపంచ ఎయిడ్స్ దినం



నెల్లూరు (వైద్యం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్లతో పోలిస్తే జిల్లాలో హెచ్‌ఐవీ కేసులు తగ్గినా ప్రస్తుతం నమోదవుతున్న కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. 8 నెలల కాలంలో (ఏప్రిల్ నుంచి) 500 కేసులు రికార్డుకెక్కడమే ఇందుకు కారణం. హెచ్‌ఐవీ నియంత్రణలో రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం చిత్తూరు జిల్లా మొదటి స్థానంలో ఉండగా, పశ్చిమ గోదావరి 2వ స్థానం, అనంతపురం 3వ స్థానంలో ఉన్నాయి. అయితే, నెల్లూరు జిల్లా మాత్రం గతేడాదిలా 8వ స్థానంలో నిలిచింది. ఒక స్థానం కూడా ఎగబాకపోవడంపై వైద్య ఆరోగ్యశాఖపై విమర్శలు వ్యక్తమవు తున్నాయి. కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (న్యాకో) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీ శాక్స్) హెచ్‌ఐవీ నియంత్రణకు నిధులు విడుదల చేస్తుంది. ఆ నిధులను సరిగ్గా సద్వినియోగం చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తు న్నాయి. 2002తో పోలిస్తే 17.08 శాతం 2024కు నుంచి 0.06 శాతానికి హెచ్‌ఐవీ తగ్గుముఖం పట్టినట్టు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. అయితే, క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా ఉంటోంది. జిల్లాలోనే ప్రతినెల హెచ్‌ఐవీ బాధితులు 60 మందికిపైగా నమోదవుతున్నారు. ప్రస్తుతం అధికారికంగా 12,500 మంది వరకు బాధితులు ఉన్నారు.

'స్వచ్ఛంద'ంగా చేతులెత్తేశారా!?

జిల్లాలో హెచ్‌ఐవీ నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం న్యాకో ద్వారా ఏటా రూ.20 లక్షలు మంజూరు చేస్తోంది. నెల్లూరు కేంద్రంగా ఎస్ఎస్ఎంఏఎస్ స్వచ్ఛంద సంస్థతోపాటు మరో రెండు సీసీఎస్ సంస్థలు, కావలిలో సాస్ స్వచ్ఛంగా సంస్థ హెచ్‌ఐవీ నియంత్రణకు కృషి చేస్తున్నాయి. ఒక్కో సంస్థకు ఏటా రూ.5లక్షలకుపైగా కేంద్రం విడుదల చేస్తోంది. ఆయా సంస్థల ప్రతినిధులు హెచ్‌ఐవీ ప్రబలే వర్గాలలో చైతన్యం తీసుకురావాలి. శృంగారంలో పాల్గొనేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారం చేయాలి. అనుమానితులను జిల్లాలోని 7 ఎయిడ్స్ నిర్ధారణ కేంద్రాలకు తీసుకు వెళ్లి పరీక్షలు చేయించాలి. అయితే, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆయా స్వచ్ఛంద సంస్థలు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం లక్ష్యం నెరవేరడం లేదన్న వాదన ఉద్యోగ వర్గాల్లో వినిపిస్తోంది.

వైద్యసేవలు ఇలా

జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో ఏడు హెచ్‌ఐవీ కౌన్సెలింగ్, పరీక్షా కేంద్రాలు పని చేస్తున్నాయి. శిక్షణ పొందిన కౌన్సెలర్లు హెచ్‌ఐవీ పరీక్షలకు ముందు, తరువాత బాధితులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. సుఖవ్యాధులు ఉన్నవారిలో 10 శాతం మందికి హెచ్‌ఐవీ సోకే అవకాశం ఉన్నందున నెల్లూరులోని జీజీహెచ్, కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. బాధితులకు ఉచితంగా మందులు అందించేందుకు జీజీహెచ్‌లో యాంటి రిట్రోవైరస్ థెరపీ (ఏఆర్టీ) సెంటర్‌ను ఏర్పాటు చేశారు. దీనికి అనుబంధంగా కావలిలో మరో సెంటర్ నడుస్తోంది. అలాగే బాధితులు ఎవరైనా 1097కు ఫోన్ చేసి వైద్యసేవలు పొందాలని అధికారులు కోరుతున్నారు. కొత్తగా ప్రెప్ ట్రీట్‌మెంట్ నూతన చికిత్సా విధానం ద్వారా చాలా వరకు వ్యాధిని అదుపులో ఉంచుకో వచ్చని చెబుతున్నారు.

హెచ్‌ఐవీ బాధితుల సంఖ్య			
సంవత్సరం	పరీక్షలు	బాధితులు	నిర్ధారణ శాతం
2019 -20	1,31,914	1007	0.7
2020- 21	70,966	577	0.8
2021- 22	1,50,457	710	0.5
2022- 23	1,91,042	811	0.4
2023 - 24	1,21,946	741	0.6
2024 - 25	1,30,886	500	0.4

బాధితులకు అందని పెన్షన్

హెచ్‌ఐవీ బాధితులకు అండగా నిలవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల పెన్షన్ అందిస్తోంది. దీనికి కొన్ని నిబంధనలు విధించింది. 5 ఎకరాలు భూములు ఉన్నా, కరెంటు బిల్లులు ఎక్కువగా కడుతున్నా, ఇతర ఆస్తులు ఉన్నా ఈ పెన్షన్ రాదు. ప్రస్తుతం 2202 మందికి పెన్షన్ వస్తుండగా మరో 5వేల మందికి పెన్షన్ అందాల్సి ఉంది. నాటి వైసీపీ ప్రభుత్వం ఒక పెన్షన్ కూడా మంజూరు చేయకపోవడంతో ఐదేళ్లుగా అర్హత ఉండీ పెన్షన్ అందుకోలేకపోతున్నారు. కాగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ.2,750 ఉన్న పెన్షన్‌ను రూ.4వేలకు పెంచింది. ఇది బాధితులకు ఆర్థిక తోడ్పాటు ఇస్తోంది. మరోవైపు ఏఆర్‌టీ సెంటర్‌కు ప్రతినెల మందుల కోసం వచ్చేందుకు వీలుగా బస్‌పాసులు ఇస్తుండగా, వైసీపీ సర్కారు వాటిని రద్దు చేసింది. దీంతో బాధితులపై చార్జీల భారం పడుతోంది. ఈ నేపథ్యంలో ఈ ప్రభుత్వంలోనైనా పింఛనుతోపాటు బస్‌పాసులు ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు.

హెచ్‌ఐవీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు



జిల్లాలో హెచ్‌ఐవీ కేసులు బాగా తగ్గాయి. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణలో స్వచ్ఛంద సంస్థలు చక్కగా పని చేస్తుండటంతో ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నాము. గర్భవతులకు ముందస్తుగా హెచ్‌ఐవీ పరీక్షలు చేస్తున్నాం. ఎవరికైనా హెచ్‌ఐవీ ఉంటే పుట్టే పిల్లలకు రాకుండా ముందస్తు చికిత్సలు అందిస్తున్నాం. అయితే పింఛన్లు, బస్ పాసులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- డాక్టర్ ఖాదర్‌వలి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి

పీఎంఏవై గృహాలకు భారీగా దరఖాస్తులు

నెల్లూరు (జడ్పీ), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకం ద్వారా గృహాల కోసం భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. పేద, మధధధదదదద్య తరగతి ప్రజల నుంచి గృహాలకు దరఖాస్తులు స్వీకరించాలని కేంద్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీంతో నుడా పరిధిలోని నగరం, మండలాలు, పట్టణాల నుంచి హౌసింగ్ శాఖ దరఖాస్తులు స్వీకరిస్తోంది. గూడులేని పేదలతో పాటు, స్థలాలు ఉండి, ఇళ్లు నిర్మించుకోలేని పేద, మధ్య తరగతి ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని తెలపడంతో నగరంతో పాటు మిగతా 7 నియోజకవర్గాల్లోని పేదలు గృహాలు కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. అలాగే స్థలాలు లేని నిరుపేదలకు టిడ్కో నిర్మించే అపార్టుమెంట్ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించిడంతో గతంలో హౌసింగ్ ద్వారా ఇళ్ల నిర్మాణాలు పొందని వారంతా దరఖాస్తులు చేసుకుంటున్నారు. గత 20 రోజులుగా జిల్లాలో హౌసింగ్ అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నియోజకవర్గం, మండలాల వారీగా వచ్చే దరఖాస్తులను స్వీకరించి, వాటిపై సర్వే చేస్తున్నారు. ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకం ద్వారా ఇళ్ల నిర్మాణాలకు పేద, మధ్య తరగతి ప్రజలకు రేషన్, ఆధార్ కార్డుతో పాటు, రేషన్‌కార్డు లేని మధ్య తరగతి ప్రజలకు రూ.3లక్షల వరకు ఆదాయపు పన్ను కలిగిన వారందరిని అర్హులుగా నిర్ణయించారు. దీంతో అటు రేషన్‌కార్డు ఉన్న పేదలతో పాటు, రూ.3లక్షల వరకు ఆదాయపు పన్ను చెల్లించే మధ్య తరగతి ప్రజలు ఈ పథకానికి అర్హులుగా ఉన్నారు. దీంతో సొంత స్థలాలు ఉన్నా, లేకున్నా వారంతా దరఖాస్తు చేసుకుంటున్నారు.



9 వేలు వచ్చిన దరఖాస్తులు

జిల్లాలో ఇప్పటి వరకు 9వేల మేరకు దరఖాస్తులు ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకానికి అందాయి. ఇందులో నెల్లూరు సిటీ నుంచి 259, ఆత్మకూరు నియోజ కవర్గంలో 1390, కందుకూరులో 1063, కావలిలో 986, కోవూరులో 1669, నెల్లూరు రూరల్‌లో 676, ఉదయగిరిలో అత్యధికంగా 2,467, సర్వేపల్లిలో 640 దరఖాస్తులు అందాయి. వీటితో పాటు మరికొన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉండడంతో వచ్చేనెల 15 వరకు వీటిని స్వీకరించనున్నారు. అనంతరం వాటన్నింటిపై సర్వే చేసి అర్హత ఉన్న దరఖాస్తు లను ప్రభుత్వానికి పంపనున్నారు. ఇప్పటి వరకు ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.1.80లక్షలు ఇస్తుండగా, పీఎంఏవై పథకం ద్వారా ఈ మొత్తాన్ని భారీగా పెంచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్ఆర్‌జీఎస్ నిధులతో పాటు ఒక్కో గృహానికి రూ.3.లక్షల వరకు నిధులు వచ్చే అవకాశం ఉన్నట్లు పాలకులు పేర్కొంటున్నారు. అయితే నిధుల ఖరారుపై కేంద్రం నుంచి విధివిధానాలు రావాల్సి ఉంది. ఈలోపు అర్హుల జాబితాను పూర్తిగా సేకరించి అధికార యంత్రాంగం వాటిని సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపనున్నారు.

తప్పని 'అపార్' కష్టాలు

- ఆధార్, పుట్టినరోజు సవరణలకు అగచాట్లు
- కార్యాలయాల చుట్టూ పది, ఇంటర్ విద్యార్థుల ప్రదక్షిణలు
- చేతులు తడిపితేకాని దరఖాస్తు కదలవంటున్న సిబ్బంది

వలేటివారిపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అపార్ ఐడీ కోసం విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. సచివాలయం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులు, తల్లిదండ్రులు క్యూ కడుతున్నారు. మండలంలో మొత్తం 54 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 3,900 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. ఇప్పటివరకూ 1,600 మందికి మాత్రమే సర్టిఫికెట్ల కరెక్షన్ జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీ కార్డులు ప్రక్రియ ఉపాధ్యాయులు, విద్యార్థులకు చుక్కలు చూపెడుతోంది. పాఠశాల రిజిస్టర్లు, ఆధార్ వివరాలకు సరిపోకపోవడంతో కార్డులు జారీలో జాప్యం అవుతోంది. సకాలంలో ఆ పని పూర్తి చేయపోతే ప్రధానోపాధ్యాయులను బాధ్యులను చేస్తామని విద్యాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో అపార్ పూర్తి చేసేందుకు వారంతా విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నారు.

ఒకే ఒక్కటి..

మండలంలో వలేటివారిపాలెం సచివాలయంలో మాత్రమే ఆధార్ కేంద్రం ఉంది. విద్యార్థులందరినీ ఈ కేంద్రంలోనే సర్టిఫికెట్లు కరెక్షన్ చేయాలి. మండలంలో 3,900పైగానే సర్టిఫికెట్ల కరెక్షన్ ఉంది. రోజుకు 50-60 సర్టిఫికెట్లు కరెక్షన్ మాత్రమే అవుతున్నట్లు అధికారులు వాపోతున్నారు. ఇంకా 2,300 సర్టిఫికెట్లు కరెక్షన్ ఎప్పటికి పూర్తవుతాయోననే ఆందోళన చెందుతున్నారు. ఒక్క అక్షరం తేడా ఉన్న ఆధార్ మార్చుకోవాల్సిందేనని ప్రధానోపాధ్యాయులు చెబుతుండడంతో విద్యార్థులు



వలేటివారిపాలెం సచివాలయలో కరెక్షన్ కోసం క్యూ కట్టిన విద్యార్థులు

ఆధార్ కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులోకి తెస్తామని చెబుతున్నారే తప్ప ఆ విషయలో ముందడుగు పడడం లేదు. శివారు గ్రామాల్లోని విద్యార్థులు ఉదయం ఆరు గంటలకే బయలుదేరి మండలకేంద్రంలోని ఆధార్ కేంద్రానికి చేరుకుని సాయంత్రం వరకు పడిగాపులు కాస్తున్నారు. అదనపు కేంద్రాలు ఏర్పాటు చేస్తే కానీ ఈ సమస్య పరిష్కారమయ్యే అవకాశం లేదు.

- ఉలవపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో లేట్ డేట్ ఆఫ్ బర్త్ ఎంట్రీ సర్టిఫికెట్లు ఆలస్యం అవుతున్నాయి. వీఆర్వోల దగ్గర నుంచి తహసీల్దారు వరకు రోజుల తరబడి పిల్లలు వారి తల్లిదండ్రులతో కలిసి కార్యాలయం చుట్టు ప్రదక్షణలు చేస్తున్నారు. పది మంది విద్యార్థుల్లో సగం మందికిపైగా ఆధార్ సవరణలు, పంచాయతీల రికార్డుల్లో పుట్టిన రోజు సరవణలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆధార్‌లో నమోదైనా పుట్టినరోజుకి స్కూల్ రికార్డుల్లో నమోదు అయిన తేదీలకు పొంతన లేకపోవడంతో ఆధార్‌లో సవరణ చేయాలంటే 18ఏళ్లలోపు వారికి అధికారికంగా జారీచేసిన పుట్టిన రోజు సర్టిఫికెట్ తప్పనిసరైంది. స్థానిక పంచాయతీ కార్యాలయాల్లో ఎన్‌వోసీ తీసుకొని లేట్ డేట్ ఆఫ్ బర్త్ ఎంట్రీ కోసం తహసీల్దారు కార్యాలయంలో నమోదు చేసుకుంటే అక్కడ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయంకు ఫైల్ చేరుకునేందుకు వారం నుంచి 10రోజులు పడుతున్నాయి. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైల్ ముందుకు కదలాలంటే స్వయంగా దరఖాస్తురులు వెళ్లి ముడుపులు చెల్లిస్తేకాని పనికాదు.. లేదంటే రోజుల తరబడి ఎదురు చూడాల్సిందే. అన్ని సక్రంగా ఉంటేనే పది, ఇంటర్ పరీక్షలకు అర్హులు. విద్యార్థుల ఆధార్, పుట్టినరోజు అలాగే తల్లిదండ్రుల ఆధార్ అన్ని సక్రమంగా ఉంటేనే పది, ఇంటర్ విద్యార్థుల పబ్లిక్ పరీక్షలకు ఫీజులు కట్టించుకుంటామని స్కూల్, కళాశాల యాజమాన్యలు చెప్తుంటడంతో విద్యార్థులు తల్లిదండ్రుల ఆందోళన చెందుతున్నారు. పైగా ఆధార్ సవరణకు అవసరమైన లేట్ డేడ్ ఆఫ్ బర్త్ సర్టిఫేకెట్స్ ఆలస్యం కూడా వారి ఆందోళనకు మరో కారణంగా చొప్పవచ్చు.

ఉన్నతాధికారులకు విన్నవించాం

కేంద్రం ప్రవేశపెట్టిన అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీ కార్డులు ప్రక్రియ కోసం ఆధార్ కేంద్రాలు పెంచాలని ఉన్నతాధికారులకు విన్నవించాం. సమస్యపై వివరించాం. అపార్ ఐడీ ప్రక్రియ వివరాల్లో తప్పులు లేకుండా చూడాలని వారు చెబుతున్నారు.

- నరేంద్రదేవ్, ఇన్‌చార్జి ఎంపీడీవో, వలేటివారిపాలెం

అక్రమంగా మట్టి తరలింపు

వింజమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నందిగుంట గ్రామంలో ప్రభుత్వ భూమి నుంచి మట్టిని జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో భారీగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకో వడం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. సిమెంటు రోడ్డు మార్జిన్ కోసమని చెప్పి ఎటువంటి అనుమతులు లేకుండా ఇళ్లకి తోలు కుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి రవాణా చేస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ట్రాక్టర్‌లో తోలుతున్న మట్టి



రోడ్డును కమ్మేసిన ముళ్లపొదలు

ముళ్లపొదలు కమ్మేయడంతో సోమశిల - ఆత్మకూరు, అనంతసాగరం - బద్వేల్ రోడ్లు ప్రమాదకరంగా మారాయి. రోడ్డు మార్జిన్‌లో చెట్లు రోడ్డును కమ్మే యడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సమయం లో ప్రమాదాలు జరుగుతు న్నాయి. గౌరవరం, కొత్తపల్లి, మినగల్లు, వడ్డిపాలెం వద్ద రోడ్డు కనిపించక వాహనదా రులు ఇబ్బందులు పడుతు న్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

- అనంతసాగరం (ఆంధ్రజ్యోతి)



సిమెంట్ గోదాముగా స్కూలు

సంగం పంచాయతీ మజరా గ్రామమైన వెంకటేశ్వరపురంలో మూత పడిన పాఠశాల భవనం ప్రైవేటు వ్యక్తులకు సిమెంట్ గోడౌన్‌గా మారింది. ఈగ్రామంలో కేవలం 30 కుటుంబాలే ఉన్నా యి. గతంలో చదువుకునే చిన్నపిల్లలు ఉండడంతో పాఠశాల నిర్మించారు. క్రమేణా చదువుకునే పిల్లలు లేరు. ఒకవేళ ఉన్నా ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారు. దీంతో పాఠశాలను మూసేశారు. అప్పటినుంచి ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో ఓ వ్యక్తి ఇందులో సిమెంట్ నిల్వ చేశాడు. దీనిపై స్థానికులు మం డల అధికారులకు ఫిర్యాదు చేశారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)



మార్కెట్‌లో నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

నిమ్మకు తెగుళ్లు

- తగ్గుతున్న కాయల ధరలు
- ఆందోళనలో సాగుదారులు

పొదలకూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొన్ని ప్రాంతాల్లో నిమ్మచెట్లకు తెగుళ్లు సోకాయి. దీంతో కాయల ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక నిమ్మమా ర్కెట్‌లో శుక్రవారం వరకు లూజు బస్తా ధర రూ.2,500 నుంచి రూ.4,000 వరకు పలికింది. శనివారం ధర రూ.1,600 నుంచి రూ.2,400 వరకు పలికింది. దీంతో సాగుదారులు దిగాలు పడ్డారు. ప్రస్తుతం కురు స్తున్న, ఇంతకుముందు కురిసిన వర్షాలకు క్యాంకర్ తెగులు సోకి నిమ్మకాయలు నాణ్యత లేకుండాపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. అంతేకాక గాడిద మచ్చ తెగులుతో నష్టం వస్తోందని వారు పేర్కొన్నారు. ఫెంగల్ తుఫాన్ వల్ల నిమ్మకాయలు నీటిని బాగా పీల్చుకుని తెగుళ్లు సోకుతాయని వ్యాపారులు అంటున్నారు. మచ్చ తెగులు సోకినవి బస్తా రూ.600కు కూడా కొనుగోలు చేయ డం లేదని రైతులు వాపోతున్నారు. గత మేనెలలో తోటలకు సోకిన తెగుళ్లతో ఆగస్టు వరకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు.

● దిగుబడులు పెరిగినా... నాణ్యతేదీ ?

ఢిల్లీ మార్కెట్‌కు తరలించేందుకు వర్షాల కారణంగా రవాణా కష్టంగా మారింది. దీంతో దక్షిణాది ప్రాంతాలయిన చెన్నై, మధురై, బెంగళూరు, కేరళ ప్రాంతాలకు నిమ్మ కాయలు తరలిస్తున్నారు. దిగు బడులు పెరిగినా నాణ్యత లేవని వ్యాపారులు చెబు తున్నారు. బాగు న్నవి కోల్‌కతా, బిహార్, రాంచీ, గయా ప్రాంతాలకు తరలిస్తున్నారు. నిమ్మ వ్యాపారి ఎస్.వెంకటేశ్వర్లునాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రా లకే కాయలు ఎగుమతి చేస్తున్నామన్నారు. ప్రస్తుతం వచ్చే దిగుబడులతో 25 శాతం మాత్రమే ఆదాయం వస్తున్నదని, డిసెంబరు వరకు కూడా ఇలాగే ఉంటుందని చెప్పారు. నాణ్యత లేని నిమ్మకాయలను దూర ప్రాంతాలకు తరలిస్తే నష్టాలొస్తు న్నాయని ఆయన పేర్కొన్నారు.

12 సచివాలయాల సిబ్బందికి

షోకాజు నోటీసులు

- లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఏడీసీ ఆదేశం
- పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యానికి తాకీదు

నెల్లూరు(సిటీ), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 12 సచివా లయాల్లోని కార్యదర్శులకు ఏడీసీ నందన్ శనివా రం షోకాజు నోటీసులు జారీ చేశారు. పింఛన్ల పంపిణీ ఆలస్యంగా మొదలుపెట్టడం, కార్పొరేషన్ కార్యాలయానికి ఫోన్లలో అందుబాటులో లేకపోవ డం, విధి నిర్వహణలో అలసత్వాన్ని ప్రదర్శించా రన్న కారణాలను అందులో ప్రస్తావించారు. షోకాజు నోటీసు అందిన 24 గంటల లోపు లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని, లేకపోతే సీసీఏ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు. నోటీసులు అందుకున్న వారిలో ఆకుతోట హరిజన వాడ, చాకలివీధి, చంద్రమౌళినగర్, ద్వారకా నగర్-01, గౌతమినగర్-1, 2, కపాడిపాళెం-01, నేతాజీ నగర్, పోలే రమ్మచెట్టువీధి-01, సుబేదార్ పేట, జడ్పీకాలనీ సచివాల యాల్లో పని చేసే అడ్మిన్లు, వెల్ఫేర్, అమినిటీస్, ప్లానింగ్, ఎడ్యుకేషన్, మహిళ పోలీసు కార్యదర్శులున్నారు. అలాగే విశ్వహస్పిటల్ ప్రాంతంలోని జచివాలయంలో ఇద్దరికి, జకీర్‌హు స్సేన్‌నగర్ 02లోఇద్దరికి నోటీసులు జారీ చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	111
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	224
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7378
వెండి కిలో ధర	రూ. 91,900
వెండి ఒక గ్రాము	రూ.94.90

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నెల్లూరు(క్రైం), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆత్మకూరు బస్టాండు ప్రాంతంలో గాయాలతో ఉన్న వ్యక్తిని చికి త్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించగా ఆయన చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. నార్త్‌ట్రాఫిక్ పోలీసుల సమా చారం మేరకు.. నవం బరు 23వ తేదీన ఆత్మకూరు బస్టాండు సమీపంలో గాయాలతో ఉన్న వ్యక్తిని స్థానికులు చికిత్స నిమిత్తం 108 సాయంతో జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ వ్యక్తి శుక్రవారం రాత్రి మృతి చెందారు. శనివారం సమాచారం అందుకున్న నార్త్‌ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైకు అదుపుతప్పి

దంపతులకు గాయాలు

వెంకటాచలం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలం లోని కసుమూరు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమా దంలో దంపతులిద్దరూ గాయ పడ్డారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరులోని బాలా జీనగర్ ప్రాంతానికి చెందిన కాలేషా, అఫ్రిన్ దంపతులు మోటర్ బైకుపై కసుమూరు దర్గాకు వెళ్లి తిరిగి నెల్లూరుకు వస్తున్నారు. కసుమూరు దాటాక వచ్చే మలుపు వద్ద ఒక్కసారిగా టిప్పర్ ఎదురుగా రావడంతో బైకు అదుపుతప్పి బోల్తాపడింది. ఈప్ర మాదంలో దంపతు లిద్దరు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమి త్తం వెంకటాచలంలోని ఒక ప్రైవేటు క్లీనిక్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మళ్లీ అన్నదాతకు 'సాంకేతిక' చేరువ

- రాయితీపై పరికరాల పంపిణీ
- జగన్ పాలనలో పథకం నిర్వీర్యం
- వ్యక్తిగతంగా అందజేసేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు



అన్నదాతలకు దన్నుగా సాంకేతిక అండ ఉండాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పదేళ్ల క్రితం తెలుగుదేశం పార్టీ హయాంలో రైతులకు వ్యక్తిగతంగా అందిస్తున్న రాయితీ పరికరాలు తిరిగి అందించేందుకు ముందుకొచ్చింది. ఇప్పటికే బడ్జెట్ కేటాయింపులు కూడా చేయడంతో అతి త్వరలో రైతులకు వ్యక్తిగత రాయితీపై సాంకేతిక పరికరాలు అందనున్నాయి.

- నెల్లూరు(వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)



జిల్లాలో దాదాపు 5లక్షల ఎకరాల్లో వరి, మినుము, వేరుశనగ, శనగ, పెసరతో పాటు పలు ఉద్యాన పంటలు సాగవుతుంటాయి. గతంలో టీడీపీ హయాం లో వ్యవసాయానికి అవసరమైన ట్రాక్టర్లు, దమ్ము యంత్రాలు, నూర్పిడి యంత్రాలు, పవర్ టిల్లర్లు, డ్రమ్ సీడర్లు, స్ప్రేయర్లు ఇలా రైతులకు అవసరమైన పరికరాలను వ్యవసాయ శాఖ ద్వారా అందేవి. అయితే, వైసీపీ అధికారం చేప ట్టిన తరువాత జగన్ పాలనలో ఈ పథ కాన్ని పూర్తిగా నిర్వీర్యం



చేశారు. ఐదేళ్లపాటు కనీసం ఒక్కటంటే ఒక్క యంత్రం కూడా రైతులకు వ్యక్తి గతంగా అందించిన దాఖలాలు లేవు. రైతు సంఘాలుగా ఏర్పడితేనే ఇస్తామని ప్రకటించినా అరకొరగానే వైసీపీ మద్దతుదారులకే అందాయన్న విమ ర్శలు మూటగట్టుకున్నారు. వ్యక్తిగత రాయితీపై పరికరా లు అందించాలని వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులకు విన్న వించినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం కూటమి ప్రభు త్వం అధికారంలోకి రావడంతో పథకాన్ని తిరిగి ప్రారంభిస్తారని రైతులు ముందు నుంచి భావించారు. దానికి తగ్గట్టుగానే వ్యవసాయ శాఖ మంత్రి అందిస్తా మని ప్రకటించడంతోపాటు బడ్జెట్‌ను కూటా ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దీంతో రైతుల్లో సంతోషం నెలకొంది.

● రైతులకు భరోసా..

దుక్కి దున్నడం నుంచి చేతికొచ్చిన పంటను మార్కెట్‌లో అమ్ముకునే వరకు వ్యవసాయ యంత్రపరికరాలు రైతులకు ఎంతో అవసరం. కూలీల కొరతను అధిగమించడం కోసం అదేవిధంగా పెట్టుబడి భారం తగ్గించు కోవడం, సాగులో యాంత్రీకరణ, స్ప్రేయర్లు ఇలా చిన్న చిన్న పరికరాలు ఎంతో కీలకం. గతంలో ఇవన్నీ 30 నుంచి 50 శాతం రాయితీపై రైతులకు అందేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తిరిగి రైతులకు భరోసా ఇస్తూ పథకాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకొస్తూ అండగా నిలుస్తోంది. రబీ సీజన్ ప్రారంభం కావడంతో త్వరలో పథకం అమలు చేస్తే అందరికి ఉపయోగకరండా ఉంటుందని రైతులు కోరుతు న్నారు.

● పరికరాలన్నీ వైసీపీ నాయకులకే...

ఐదేళ్ల జగన్ పాలనలో రైతులకు వ్యక్తిగత రాయితీపై కనీసం ఒక్క యంత్రం కూడా అందలేదు. రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఒక్కో రైతు సంఘం ఏర్పాటు చేయించి వారికి దాదాపు రూ.15లక్షల విలువైన యంత్ర పరికరాలను అందించారు. అదికూడా ముందుగా ఆయా కంపెనీలకు రైతు సంఘాలతో కస్టం హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ముందు నగదు చెల్లించి ఆ తరువాత సబ్సిడీ నగదును రైతు సంఘాల బ్యాంకు ఖాతాలోకి జమ చేయడం జరిగింది. ఇలా తీసుకున్న పరికరాలు రైతు భరోసా కేంద్రంలో ఉంచాలి. ఇతర రైతుల వ్యవసాయ పనులకు అద్దె రూపంలో అందించాలి. దీనికోసం వైఎస్ఆర్ యంత్ర సేవా యాప్ కూడా ఏర్పాటు చేశారు. అయితే ఎక్కడా ఇలాంటి ప్రక్రియ జరగలేదు. పరికరాలన్నీ స్థానిక వైసీపీ నాయకులు, వారి అనుచరులకే దక్కాయన్న విమర్శలు ఉన్నాయి.

క్రీడా జ్ఞాన పరీక్ష పోటీలకు

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు క్రీడలపై అవగాహన కల్పించేందుకు క్రీడా భారతి నిర్వహించే 4వ క్రీడా జ్ఞాన పరీక్ష పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారి నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానించినట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్‌కె.యతిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. 12 ఏళ్ల వయస్సు పైబడిన వారు ఆన్‌లైన్‌లో ఈనెల 7వతేదీ లోపల రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. 8వ తేదీన పరీక్ష ఉంటుందని, ఆసక్తి కలిగిన వారు తమ ఆధార్‌కార్డుతో పాటు పూర్తి వివరాలను kreedabharati.org వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ఏసీ స్టేడియంలో సంప్రదించాలని పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50వేలు, తృతీయ బహుమతి రూ.25వేలు, నాల్గొవ బహుమతి రూ.11వేలు అందచేస్తారని తెలిపారు.

వైభవంగా

గంధ మహోత్సవం

వరికుంటపాడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తోటలచెరువుపల్లిలో శనివారం సయ్యద్ ఖ్వాజా రహంతుల్లా అల్లై ఉరఫ్ హజరత్‌చిష్తి బాబాజన్ 25వ, ఖాసిం చిష్తి 13వ గంధ మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంధాన్ని హక్కుదా రుల ఇంటి నుంచి బాణసంచా పేలుళ్ల నడుమ దర్గా కు చేర్చారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం గంధా న్ని భక్తులకు పంచిపెట్టారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

నెల్లూరు చెత్త

గుంటూరుకి తరలింపు

- రూ.7 కోట్లతో వాహన కొనుగోలుకు ప్రతిపాదనలు
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ



గ్రీనరీ నిర్వహణను మంత్రికి ల్యాప్‌టాప్‌లో చూపుతున్న కమిషనర్

నెల్లూరు (సిటీ), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని చెత్తను గుం టూరుకు తరలించేందుకు అవసరమైన వాహన కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజను ఆదేశించారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారు లతో ఆయన సమీక్షించి మాట్లా డారు. గుంటూరులోని చెత్త నుంచి సంపద తయారీ కర్మా గారానికి నెల్లూరులోని చెత్తను తరలించేందుకు కసరత్తు జరుగుతుందని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల న్నారు. ఇందుకు రూ.70 లక్షలు విలువ చేసే పది కంపాక్టరు వాహనాల కొనుగోలుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. పారిశుధ్యం మెరుగుకు వాహనాల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నగరంలోని కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలని వెటర్నరీ వైద్యుడుని ఆదేశించారు. కోతులు పట్టించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పార్కులు, రోడ్డు మార్జిన్ ప్రాంతాలలో మొక్కలు పెంచి పచ్చదనం పెంపొందిం చాలన్నారు. సిటీప్లానింగ్ విభాగంలో సమూల మార్పులు తీసుకు వచ్చామని గుర్తు చేసిన ఆయన నిర్మాణ దారుల నుంచి వచ్చిన దరఖాస్తులను ఏ రోజుకా రోజు పరిష్కరించా లని స్పష్టం చేశా రు. ఈ విషయంలో జాప్యం జరగ డానికి వీలు లేదని హెచ్చరించారు. అక్రమ లేఅవుట్లపై నుడా అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం తగదని తెలిపారు. ఇక నుంచి అక్రమ లేఅవుట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. నెల్లూరులో గుర్తించిన 4 వేల సంతంభాలకు వైర్లు, లైట్లు వేగవంతంగా ఏర్పాటు చేయాలని సూచించారు.

పన్నులు చెల్లించకుంటే ఇబ్బందులు తప్పవు

నగర అభివృద్ధి కోసం పన్నులు వసూళ్లు చేస్తున్నామని, మొండి బకాయిదారులకు కొంత సమయం ఇస్తామని ఆలో పు చెల్లించకుంటే ఇబ్బందులు తప్పవని మంత్రి నారాయణ పరోక్ష ంగా హెచ్చరించారు. రాష్ట్రంలో అమలవుతున్న పన్ను వసూళ్ల విధానమే నెల్లూరులోనూ అమలవుతుందని స్పష్టం చేశారు. ప్రజలు చెల్లించే పన్నులనే తిరిగి వారి మౌలికవస తుల కల్పనకే ఖర్చు చేస్తామని చెప్పారు. పన్ను వసూళ్ల ప్రక్రియలో అధికారులు ప్రజలను ఇబ్బందులు గురి చేయ వద్దన్నారు. చెత్తను శుద్ధి చేసే ప్లాంటు రాజమండ్రితో పాటు నెల్లూరుకు మంజూరు చేసినట్లు తెలిపారు. వర్షాలు తగ్గాక రహదారులపై గుంతలను పూడ్చనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏ పరిధి ఎవరిది?

- ఇరిగేషన్‌లో బౌండరీల గందరగోళం
- గత ప్రభుత్వంలో ఇష్టమొచ్చినట్లు మార్పులు
- పాలనా పరంగా తలెత్తుతున్న ఇబ్బందులు
- జాఫర్ సాహెబ్ కాలువ వెంబడి ఆక్రమణలు
- మంత్రి ఆదేశించినా తొలగింపులో సరిహద్దుల వివాదం



మైపాడుగేట్ వద్ద ఏర్పాటు చేసిన షెట్టర్ దుకాణాలు

నెల్లూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ శాఖలో పరిధుల వ్యవహారం సరికొత్త వివాదానికి తెరలేపింది. ఏ పరిధి ఎవరి కిందకు వస్తుందో స్పష్టత లేక గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇది ఆక్రమణదారులకు వరంగా మారింది. ఇరిగేషన్ శాఖలో వివాదం ఏమిటి.. ఆక్రమణదారులకు వరం ఏమిటి.. అనుకుంటున్నారా..? అవును ఇది నిజం. జాఫర్ సాహేబ్ కాలువ వెంబడి ఆక్రమణల పర్వం మొదలైంది. కొందరు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు ప్రారంభించారు. అయితే దీనిపై స్థానికులు అధికారులతో పాటు మంత్రి పొంగూరు నారాయణ వరకు ఫిర్యాదు చేశారు. దీంతో నగరంలో కాలువల వెంబడి ఆక్రమణలు జరగకుండా చూడాలని స్వయంగా మంత్రి ఆదేశించారు. అయితే ఈ ఆక్రమణలు ఎవరు తొలగించాలన్నదే ఇప్పుడు అతి పెద్ద ప్రశ్నగా మారింది. ఈ క్రమంలోనే పరిధుల వ్యవహారం చర్చకు దారితీసింది. వాస్తవానికి నెల్లూరు నగరం మొత్తం నెల్లూరు సబ్ డివిజన్ పరిధిలో ఉండాలి. కానీ గత ప్రభుత్వంలో అప్పటి ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు తమకు నచ్చిన వారి కోసం నచ్చిన విధంగా బౌండరీలు మార్చేశారు. నెల్లూరు సబ్ డివిజన్ పరిధిలో నెల్లూరు నగరంలో జరుగుతున్న వర్కులను కోవూరు డ్రైనేజీ సబ్ డివిజన్ కిందకు మార్చారు. అందులో పెన్నా ప్రొటెక్షన్ వాల్స్‌తో పాటు సర్వేపల్లి కాలువ, జాఫర్ సాహేబ్ కాలువల లైనింగ్ పనులు కూడా ఉన్నాయి. ఇలా బౌండరీలు మార్చే అధికారం తమకు లేదని తెలిసినా గత ప్రభుత్వంలో ఇరిగేషన్ అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో మార్పులు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెన్నా ప్రొటెక్షన్ వాల్స్ పరిధిని బుచ్చి సబ్ డివిజన్ కిందకు మరోసారి మార్పు చేశారు. కానీ జాఫర్ సాహేబ్ కాలువ, సర్వేపల్లి కాలువలను మాత్రం తిరిగి నెల్లూరు కిందకు చేర్చలేదు. ఇప్పుడు ఈ రెండు కాలువలు ఏ సబ్ డివిజన్ కిందనున్నాయో ఎవరికీ అర్థం కాని పరిస్థితి. ఇటీవల బదిలీల్లో అన్ని డివిజన్లకు కొత్త అధికారులు వచ్చారు. జిల్లాలో కూడా కొత్త అధికారులు బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు బౌండరీల వ్యవహారం వీరందరికీ గందరగోళంగా మారింది.

● మాదంటే.. మాది కాదంటూ..

సర్వేపల్లి కాలువ వెంబడి ఆక్రమణలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆఖరుకు కాలువలో పూడిక తీసేందుకు మెషిన్లు కూడా తిరగలేని విధంగా పరిస్థితి మారిపోయింది. ఇప్పుడు ఈ ఆక్రమణదారులను ఖాళీ చేయించడం తలకుమించిన భారంగా మారింది. అయితే ఇదే తరహాలో జాఫర్ సాహేబ్ కాలువ వెంబడి కూడా ఆక్రమణలు మొదలయ్యాయి. ఈ కాలువకు రెండు వైపులా లైనింగ్ పూర్తి చేశారు. ఈ కాలువ వెంబడి ఖాళీ స్థలం (జీప్ ట్రాక్) ఎక్కువగా ఉండడంతో అక్కడ దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఆక్రమణలపై ఇటీవల స్థానికులు పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారు. ఎవరూ పట్టించుకోకపోతే జాఫర్ సాహేబ్ కాలువ కూడా సర్వేపల్లి కాలువ మాదిరిగా మారిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మంత్రి నారాయణ కూడా కాలువల ఆక్రమణలను సహించవద్దని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. జాఫర్ సాహేబ్ కాలువ వెంబడి ఆక్రమణలు తొలగించాలని కలెక్టర్ ఆనంద్ కూడా ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అయినప్పటికీ ఆక్రమణలు తొలగడం లేదు. ఈ ఆక్రమణలు తొలగించాలని ఇరిగేషన్ ఎస్ఈ కింది స్థాయి అధికారులను ఆదేశిస్తుంటే.. వారు అది మా పరిధి కాదంటూ చెప్పుకుంటున్నారు. నెల్లూరు డివిజన్ అధికారులు మాత్రం జాఫర్ సాహేబ్ కాలువను గతంలో కోవూరు డ్రైనేజీ సబ్ డివిజన్ కిందకు మార్చారని చెబుతున్నారు. కోవూరు డ్రైనేజీ అధికారులు మాత్రం అది తమ పరిధి కాదని, అది నెల్లూరు నగర పరిధి అంటూ సమాధానాలు ఇస్తున్నారు. ఈ ప్రభావం ఇప్పుడు ఆక్రమణదారులకు కలిసివస్తోంది. కాగా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇష్టమొచ్చినట్లు ఒక డివిజన్ పరిధిని మరొక డివిజన్‌కు మార్చడంపై ప్రస్తుత ఉన్నతాధికారులు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తుండడం గమనార్హం. ఈ వ్యవహారంపై మంత్రి నారాయణ, కలెక్టర్ ఆనంద్‌లు జోక్యం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

న్యూస్ బాక్స్

మట్టి రోడ్డు వేయించాలని వినతి

లింగసముద్రం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):పొలాలకు వెళ్లే రోడ్డులోని చిల్లచెట్లు, పిచ్చి మొక్కలు తొలగించి మట్టి రోడ్డు వేయించాలని గంగపాలెం గ్రామస్థులు శనివారం ఎమ్మెల్యే ఇంటూరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలో 150ఎకరాలు, లింగసముద్రం పాత చెరువు కింద 150ఎకరాలు భూమి ఉందన్నారు. ఈ దారిలో చెట్టు పెరిగి దారి మూసుకుపోవడంతో ఏడేళ్లుగా రాకపోకలు సాగించడం లేదన్నారు. గ్రావెల్ రోడ్డు నిర్మిస్తే ట్రాక్టర్లు వరివిత్తనాలు తీసుకెళ్లేందుకు వీలుంటుందని గ్రామ టీడీపీ నాయకుడు చిరుమామిళ్ల శ్రీనివాసులు విన్నవించారు.

కారు అద్దాల ధ్వంసంపై కేసు

ఉదయగిరి రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పార్కింగ్ చేసిన కారు అద్దాలను ధ్వంసం చేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఏఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఏ రమణయ్య తన కారును పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో పార్కింగ్ చేశాడన్నారు. శుక్రవారం షేక్ జిలానీ అనే వ్యక్తి ఉద్దేశపూర్వకంగా రాళ్లతో కారు అద్దాలను ధ్వంసం చేసినట్లు రమణయ్య ఫిర్యాదు చేశాడన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు జిలానీని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు.

విద్యార్థుల ర్యాలీ



కేంద్రం వద్ద ఆర్ఎస్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

బిట్రగుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ డేను పురస్కరించుకుని శనివారం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముంగమూరు భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీలోని పేద, అనాథలకు, అలాగే తాళ్లపాలెంలోని రూరల్ హెల్త్‌సెంటర్‌లోని రోగులకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వీవీఎస్ రెడ్డి వారిని అభినందించారు. కార్యక్రమంలో ఏవో ఆర్వీ రమణారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్ కిరణ్‌కు మార్, అధ్యాపకులు ఉన్నారు.

90 శాతం పింఛన్ల పంపిణీ


పింఛన్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

కొండాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 90శాతం పూర్తయినట్లు ఎంపీడీవో ఆదినారాయణరావు తెలిపారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, ఒంటరి మహిళ పింఛన్లు మొత్తం 5245 ఉండగా వాటిలో 4,720 మంది లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు. 1వ తేదీ జరగాల్సిన పింఛన్ల పంపిణీ ఒక రోజుముందుగానే చేయడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

● ఉదయగిరి రూరల్ : మండలంలో 91.3 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ నగదు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో అప్పాజీ తెలిపారు. శనివారం ఆయన పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి పలువురు లబ్ధిదారులకు నగదు అందజేశారు. అందుబాటులోని లేని లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నవాజ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మందు బాబులకు అడ్డా..



పోలినేనిపాలెం డంపింగ్‌యార్డు మందు బాబులకు అడ్డాగా మారింది. ఊరికి దూరంగా ఉండడంతో రాత్రి పగలు అనే తేడా లేకుండా ఇక్కడ మద్యం సేవించి మద్యం సీసాలను పగులగొట్టి వెళుతున్నారు. వీటిని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో ఈ దుస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. .

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)

ఇన్‌చార్జిలే దిక్కు

- పక్క మండలాల అధికారులకు అదనపు బాధ్యతలు
- వారు ఎప్పుడొస్తారో.. ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి
- మండల ప్రజలకు అందని ప్రభుత్వ సేవలు


వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయం

వలేటివారిపాలెం, నవంబరు 30: (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్, విద్య, వెలుగు, పంచాయతీరాజ్, ఆయుష్ వైద్యశాల, ఉద్యానవన, గ్రంథాలయం, బీసీ హాస్టల్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ఇలా అన్నిశాఖలకు పూర్తిస్థాయి అధికారులు లేరు. పక్క మండలాల అధికారులే ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. వారు ఎప్పుడు వస్తారో, వచ్చినా ఎంత సమయం ఉంటారో తెలియడంలేదు. వారంలో రెండు లేక మూడు రోజులు మాత్రమే విధులకు హాజరు అవుతున్నారు. దీంతో సరైన సేవలు అందక మండల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రెగ్యులర్ ఎంపీడీవో లేడు..

మండల పరిషత్ కార్యాలయానికి రెగ్యులర్ ఎంపీడీఓ లేరు. కార్యాలయంలో పనిచేసే పరిపాలనాధికారి ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించారు. ఎంఈఓ లేరు. కొండాపురం రెగ్యులర్ ఎంఈఓను లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. వెలుగు ఏపీఎం లేకపోవడంతో స్థానిక కార్యాలయంలో పనిచేసే సీసీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్ ఏఈ లేరు. లింగ సముద్రం పంచాయతీరాజ్ ఏఈకి వలేటి వారి పాలెం ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. వలేటి వారి పాలెం ఆయుర్వేద వైద్యాధికారి లేక రెండేళ్ల అయ్యింది. ఈ సమస్యతో వైద్యశాల మూతపడి ఉంది. బీసీ హాస్టల్ వార్డెన్ లేక వరికుంటపాడు వార్డెన్‌కు ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. గ్రంథపాలకుడు లేక ఉలవపాడు గ్రంథపాలకుడికి బాధ్యతలు అప్పగించారు. ఉద్యానవన శాఖ అధికారి లేక కందుకూరు ఉద్యానవన అధికారికే బాధ్యతలు అప్పగించారు. 21మంది పంచాయతీ కార్యదర్శుల్లో 5గురే రెగ్యులర్ కార్యదర్శులు. ఒక్కొక్క పంచాయతీ కార్యదర్శికి ఐదారు పంచాయతీలు అప్పగించారు. ఒక్కో వీఆర్వోకు రెండు, మూడు రెవెన్యూ గ్రామాలు ఇచ్చారు. మొత్తం మీద 15గ్రామ సచివాలయాలలో 175మంది సచివాలయ ఉద్యోగులు ఉండాల్సి ఉండగా 50శాతం మందిలోపు ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే అన్నిశాఖలతో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలానికి పూర్తిస్థాయి అధికారులను నియమించాలని కోరుతున్నారు.

వర్షాలతో ఇంటి నుంచి బయటకు రాని జనం

- శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరపిలేని వాన
- చలిగాలులకు జనం బెంబేలు
- పంటలు నష్టపోతామోనని రైతుల బెంగ

అల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుఫాన్ కారణంగా మండలంలో శుక్రవారం రాత్రి నుండి వర్షం కురుస్తుంది. ఎడతెరిపిలేని వానతో జనజీవనం స్తంభించిపోవడంతో రహదారులు నిర్మానుష్యంగా మారిపోయాయి. ఇప్పుడిప్పుడే వరినాట్లు పూర్తి చేసుకున్న రైతులు ఈ వర్షం ఎక్కడ నష్టాన్ని చేకూరుస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో వరినాట్లు, పనులు నిలిచిపోయాయి. తీరప్రాంతంలో సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసి పడడంతో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా బోట్లు, వలలను భద్రపరచుకున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ వారికీ అవగాహన కల్పిస్తూ సముద్రంలోకి వెళ్లకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు.

● బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): తెల్లవారు జామునుంచి ఎడతెరపి లేని వర్షం కురవడంతో బోగోలు, ఇబ్రహీంపేట బజారులో జన సంచారంలేక బోసిపోయాయి. రైల్వే ఎల్సీ గేట్ 144 పడమర ఆర్ అండ్‌బీ రోడ్లపై, బృందావనం వీధిలో వర్షపునీరు నిల్వ ఉండిపోవడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాళ్లూరు కొత్తగిరిజన కాలనీలో విద్యుత్ లేకపోవడంతో విషపురుగులు ఇళ్లలోకి వస్తాయని స్థానికులు భయాందోళన వ్యక్తం చేశారు. తెల్లగుంట గిరిజనకాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ఏడాది అయినా విద్యుత్ తీగలు లాగకపోవడం ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు.


అల్లూరులో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

ఎల్లోడే సంబరం


పసుపు దుస్తులతో చిన్నారులు

కావలి టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక గొల్లమూడివీధిలోని నలందా హైస్కూల్‌లో శనివారం ఎల్లోడే సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు పసుపురంగు పండ్లు పోలిన వేషధారణలో చిన్నారులు కన్పించడంతో ప్రాంగణమంతా పసుపుమయంగా మారింది. కార్యక్రమంలో నలందా డైరెక్టర్ ఎండీ వసీం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెరువు కాదు.. బస్టాండే!



కొద్దిపాటి వర్షానికే స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వర్షపు నీరు నిలుస్తుండటంతో ప్రయాణికులతో పాటు వాహనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్ ఆవరణతో పాటు రాకపోకలు సాగించే మార్గాలను సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. రోడ్డు వేసే సమయంలో అయితే వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గాలు ఆలోచించక పోవడంతో ఈ సమస్య నెలకొంది. కొద్దిపాటి వర్షం వచ్చినా నీరు నిలుస్తోంది. ఈ నీరు బస్సులు రాక పోకలు సాగించేటప్పుడు అటువైపు వస్తున్న ప్రయాణికులపై పడుతుంతోంది. వర్షం వెలిసిన తర్వాత కూడా రెండు మూడు రోజులు ఆ నీరు నిలిచి బస్టాండ్ ఆవరణం మురుగు కూపంగా మారి దోమలు పెరుగుతున్నాయి. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- కావలి (ఆంధ్రజ్యోతి)

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

● ఆత్మకూరు ఆర్డీవో పావని


మాట్లాడుతున్న ఆర్డీవో పావని

ఆత్మకూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో బి.పావని సూచించారు. శనివారం ఆమె మాట్లాడుతూ ప్రాణ, ఆస్తి, పంట నష్టం సంభవించినా, ప్రజలకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనా వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 24 గంటలు అధికారులు తమ ప్రాంతాల్లో ఉండాలని తెలిపారు. ప్రజలు ఏదైనా ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ కు ఫోన్‌చేసి తెలియజేయవచ్చన్నారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను యుద్ధప్రాతిపదికన పునరావాస కేంద్రాలకు తరలించేందకు సిద్ధంగా ఉండాలని ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

సమాచారహక్కు చట్టంపై అవగాహన సదస్సు

వరికుంటపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రామాపురం, జీ.కొండారెడ్డిపల్లి గ్రామాల్లో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి రవికుమార్ రైతులకు సమాచార హక్కు చట్టం ఉద్దేశాలు, దరఖాస్తు నమోదు పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో జీ.కొండారెడ్డిపల్లి సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకటేశ్వర్లు, హరినాధ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజకు రూ. 2.62 లక్షల విరాళం


అయ్యప్ప భక్తబృందానికి చెక్కు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఆత్మకూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయంలో ఇటీవల ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి పడిపూజకు అయిన మొత్తం ఖర్చు రూ. 2.62 లక్షల రూపాయలను సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి విరాళంగా ప్రకటించి దాతృత్వం చాటుకున్నారు. శనివారం అయ్యప్ప భక్తబృందానికి ట్రస్ట్ సభ్యులు చెక్కును అందజేశారు. అదేవిధంగా మున్సిపాల్టీ పరిధిలో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, సాంబ శివ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శేషారెడ్డి, రాంపల్లి ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణం పూర్తిచేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో షాలెట్

సంగం, నవంబరు 30(నవంబరు): మం డలంలో పల్లెపండుగ కింద మంజూరు చేసి న సిమెంట్ రోడ్డు నిర్మాణాలను త్వరితగతి న పూర్తిచేయాలని ఎంపీడీవో షాలెట్ సూ చించారు. శనివారం స్థానిక మండల పరిష త్ కార్యాలయంలో ఎంపీపీ పద్మావతమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మా ట్లాడుతూ ప్రతిగ్రామంలో పల్లెపండుగ కింద సిమెంట్ రోడ్లు మంజూరయ్యాయని, కొ న్నిపనులు జరుగుతుండగా మరికొన్ని పనులు ప్రారంభం కాలేదన్నారు. అన్ని పనులను డిసెంబరు నెలాఖరుకు పూర్తిచేయాలని కోరారు. అనంతరం వ్యవసాయ, ఇరిగేషన్, డ్వామా, డీఆర్‌డీఏ వెలుగు, హౌసింగ్, విద్యాశాఖ, ట్రాన్స్‌కో, ఐసీడీయస్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుయస్, వైద్య ఆరోగ్యశాఖ, వెటర్నరీ, ఫారెస్ట్, రెవెన్యూ శాఖల అధికారులు వారి పరిధిలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సోమ్లానాయక్, జడ్పీటీసీ రావుల లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్నిశాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నీటి సమస్యపై ప్రత్యేక దృష్టి

అల్లూరు (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఎదురవుతోందని దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా వైద్య ఆరోగ్యశాఖ, రోడ్ల దుస్థితి, ఉపాధిహామీ, రెవెన్యూ సమస్యలు, వ్యవసాయ శాఖ విధి విధానాలు, హౌసింగ్ శాఖ, నీటి పారుదల శాఖలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అధికారులు వాటి వివరాలను సభ ముందు ఉంచగా అవసరమైన వాటిని వెంటనే పరిష్కరించేలా తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రజనీకాంత్, తహసీల్దారు లక్ష్మీ నారాయణ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



ఏఎస్ పేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పారిశుధ్యం మెరుగుపర్చాలని ఎంపీడీవో ప్రసన్నకుమారి సూచించారు. శనివారం ఆమె స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో గ్రామాలలో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగుపర్చాలన్నారు. సమావేశంలో ఎంపీపీ పద్మజారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నివారణపై అవగాహన


మానవహారంలో పాల్గొన్న టీఆర్ఆర్ అధ్యాపకులు, విద్యార్థులు

కందుకూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్‌రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్, మహిళా సాధికార విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. మహమ్మారి బారినపడకుండా ఆరోగ్యకరమైన జీవనం సాగించాలని పలువురు అధ్యాపకులు సూచించారు. ఎయిడ్స్ ఇప్పటికీ సైలెంట్ కిల్లర్‌గా ఉందని, శరీర రోగనిరోధక వ్యవస్థను దెబ్బతీసే ఎయిడ్స్‌కు ఇప్పటికీ మందు కనుగొననందున ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఇటీవలి కాలంలో ఎయిడ్స్‌పై ప్రచారం తగ్గటం ప్రమాదకరమని అన్నారు. అనంతరం ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కోటపాటి నరేష్‌రాజ, షేక్ షానాజ్‌బేగం, రాజగోపాల్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు

గ్రామసభల్లో భూ సమస్యల పరిష్కారం

● మస్తానయ్య, ఇన్‌చార్జి తహసీల్దారు, చేజర్ల



చేజర్ల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామసభల్లో రైతుల భూ సమస్యలు పరిష్కరిస్తామని ఇన్‌చార్జి తహసీల్దారు మస్తానయ్య సోమవారం తెలిపారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురి కాకుండా ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు.

? రీసర్వే గ్రామ సభలు ఎలా జరుగుతున్నాయి.

! మండలంలో ఇప్పటివరకు ఆరు గ్రామాలలో గ్రామసభలు నిర్వహించాం. గతంలో జరిగిన రీసర్వేపై అభ్యంతరాలు ఉన్నచోట రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నాం.

? ఇప్పటివరకు ఎన్ని అర్జీలు స్వీకరించారు.

! ఇప్పటివరకు రైతుల నుంచి 326 అర్జీలు వచ్చాయి. వాటిని త్వరలో పరిష్కరిస్తాం.

? సాగునీటి సంఘాల ఎన్నికల రైతు జాబితా సిద్ధం చేశారా.

! రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. ముఖ్యంగా రెవెన్యూ పరిధిలో ఉన్న జాబితాను సిద్ధంచేసి ఉన్నతాధికారులకు నివేదించాము.

? ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

! ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు.

ఇలా ఉంటే దోమలు రావా ?



జంగంరెడ్డిపాలెం ఎస్టీ కాలనీలో కాలనీలోని అంతర్గత రోడ్లలకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి దోమలకు ఆవాసా లుగా మారాయి. ఇటీవల లింగసముద్రం వ చ్చిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గ్రా మాలలోని పిచ్చి మొక్కల తొలగింపునకు పం చాయతీ నిధులు వాడుకోవాలని అధికా రుల కు సూచించారు. అయినా అధికారులు చర్యలు తీసుకోలేదని స్థానికులు వాపోతున్నారు.

- లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి)

ఎన్ఆర్ఐలతో సీఎంని కలిసిన ఎమ్మెల్యే కాకర్ల

జలదంకి, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శనివారం అమెరికా ఎన్ఆర్ఐ పారిశ్రామికవేత్తలు విమల్‌కుమార్ కొలప్ప, సాయికిరణ్ కొలవెన్నులతో కలసి అమరావతిలో సీఎం నారా చంద్రబాబునాయుడును కలిశారు. సందర్భంగా ఎమ్మెల్యే ఎన్ఆర్ఐలను పరిచయం చేసి మాట్లాడించారు. రాష్ట్రంలో ఆగ్రోఫామ్స్ తరహా పరిశ్రమలను నెలకొల్పి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీరు ముందుకొచ్చారని సీఎంకు తెలియజేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న వీరిని అభినందించారు. నియోజకవర్గ పరిధిలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు నెలకొల్పితే రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.



జోరుగా వరినాట్లు



మండలంలో వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మాగాణి అత్యధికంగా ఉండటంతో అధికారికంగా 26వేల ఎకరాలు, అనధికారికంగా 14వేల ఎకరాలు వరి పంటను సాగు చేస్తారు. వరినాట్లు కోసం ఇతర ప్రాంతాల నుంచి కూలీలు ఇక్కడికి వస్తుంటారు. ఈ ఏడాది ఉత్తరాది నుంచే కాకుండా పశ్చిమ బెంగాల్ నుంచి కూడా వచ్చారు.

- అల్లూరు (ఆంధ్రజ్యోతి)



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

అయ్యప్పకు పుష్పాభిషేకం

నెల్లూరు(సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి): నగరం లోని వేదాయపాలెంలోని అయ్యప్ప స్వామి ఆలయం లో అయ్యప్పస్వామికి కేరళ సాంప్రదాయ కార్తీక మాస మండల పూజలు శనివారం ఘనంగా జరిగా యి. అయ్యప్ప దేవస్థానం అంతటా పుష్పాలంకరణ సర్వాంగ సుందరంగా చేశారు. మండల పూజల్లో భాగంగా ఉదయం పాలభిషేకం, మహాగణపతి హోమం, ఉషఃపూజ, నవకాభిషే కం, అయ్యప్పకు పుష్పాభిషేకం, ఉచ్ఛపూజ, శ్రీవేలి ఉత్సవం, సాయం త్రం మహాదీపారాధన, భగవతిసే వా, అత్తాళంపూ జ, శ్రీవేలి ఉత్స వం, పడి కర్పూరం, హరివరాసనం, కార్యక్రమాలు కేరళ తంత్రులచే జరిగాయి. మండల పూజలు మధ్యాహ్నం అయ్యప్ప స్వాములకు అన్నదానం, సాయంత్రం అయ్యప్ప స్వాములకు రాత్రి బిక్ష కార్యక్రమం జరిగింది.



అయ్యప్ప ఆలయంలో నిర్వహించిన శ్రీవేలి ఉత్సవం

నేడు ఘంటసాల 102వ జయంతి

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఘంటసాల 102వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం నగరంలోని రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరం (టౌన్‌హాలు)లో ఘంటసాల మధుర సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు ప్రముఖ గాయకుడు నీలకంఠం శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా గొప్ప కళాకారుడిగా, తబలిస్టుగా పేరు తెచ్చుకున్న ఎం.శాంతికుమార్‌ను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు.

కామేశ్వరరావుకు ఘన నివాళి

నెల్లూరు (జడ్పీ)నవంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీమాన్ ఆదిభట్ల సూర్యకామేశ్వరరావు 51వ వర్ధంతిని విద్యుత్‌భవన్‌లో శనివారం నిర్వహించారు. విద్యుత్‌శాఖ ఎస్‌ఈ విజయన్ ఆయన చిత్రపటానికి మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన కామేశ్వర రావు విద్యుత్ ఉద్యోగుల్లో వెలుగులు నింపేందుకు పోరాడి ఆత్మబలిదానం చేసుకున్నారన్నారు. విద్యుత్ ఉద్యోగులు కోసం ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఈలు శేషాద్రి బాల చంద్ర, సోమశేఖర్‌రెడ్డి, డిఈ మునీంద్ర, సీనియర్ గణాంక అధికారి మురళి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ ఆనంద్



కలెక్టర్‌ను కలిసిన జనసేన పార్టీ నాయకులు

నెల్లూరు(క్రైం), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, న్యూడ్ వీడియో కాల్ స్కామ్‌పై అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి మోసాలకు గురైన వారు తక్షణం ఫిర్యాదు చేస్తే వారికి భద్రతతో పాటు న్యాయం అందేలా చర్యలు చేపడుతామని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాలపై చేపట్టనున్న అవగాహన కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా హాజరై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరుతూ శనివారం ఆ పార్టీ నాయకులు కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలెక్టర్‌ను కలిసి ఆహ్వానించారు. స్పందించిన కలెక్టర్ అవగాహన కార్యక్రమాలకు హాజరవుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి వృత్తే దైవం : ఎన్‌ఎంసీ కమిషనర్



పదవి విరమణ సభలో పాల్గొన్న కమిషనర్, ఇతర అధికారులు

నెల్లూరు(సిటీ), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు వృత్తినే దైవంగా భావిస్తారని ఎన్‌ఎంసీ కమిషనర్ సూర్యతేజ అన్నారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ చేసిన సిటీ ప్రణాళిక అధికారి కొత్తపల్లి దశయ్యకు వీడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంపాటు కుటుంబాన్ని, స్నేహితులను వదులుకుని కేవలం వృత్తి కోసం పని చేసే ఏకైక వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగేనని చెప్పారు. ఉద్యోగ విరమణ వయస్సు వచ్చేవరకు అన్ని సుఖాలకు దూరంగా జీవించి అనేక ఆటుపోటులను ఎదుర్కోవడం అలవాటుగా మారిపోతుందన్నారు. అనంతరం దశయ్యను తోటి ఉద్యోగులందరు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఏడీసీ నందన్, డీసీ చెన్నుడు, ఆర్డీటీవో మధుసూదన్, డీసీపీ పద్మజ, మున్సిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

'జాతీయ ఆర్చరీ'లో మూడు పతకాలు



విద్యార్థిని అభినందిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు(విద్య), నవంబరు 30(ఆంధ్ర జ్యోతి): గుజరాత్‌లోని నడియాద్ జిల్లా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నవంబరు 10 నుంచి 20వ తేదీ వరకు జరిగిన 68వ జాతీయ స్కూల్‌గేమ్స్ ఆర్చరీ పోటీల్లో నగరంలోని లిటిల్ ఏంజెల్స్ పాఠశాల విద్యార్థి చాట్ల అక్షయ్‌మహదేవ్ ప్రతిభ చాటి మూడు పతకాలు సాధించాడు. రికర్వ్‌రౌండ్ 30 మీటర్ల విభాగంలో, ఓవరాల్ రికర్వ్‌రౌండ్ లో రజితం, టీమ్ ఈవెంట్‌లో కాంస్య ప తకం సాధించాడు. ఈ సందర్భంగా శనివారం రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తన క్యాంపు కార్యాలయంలో అక్షయ్ మహదేవ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చాట్ల నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎడతెరపి లేని వర్షం.. నీట మునిగిన పొలాలు

● నిలిచిన విద్యుత్ సరఫరా ● జనజీవనం అస్తవ్యస్తం ● పెన్నా పొర్లుకట్టలకు పొంచి ఉన్న ముప్పు



టీపీ గూడూరు : గిరిజనులను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్న టీడీపీ నాయకులు



వెంకటాచలం : హైవేపై నిలిచిన నీరు



బుచ్చి: జొన్నవాడ సమీపంలో పొర్లుకట్టను తెగ్గొట్టి ఏర్పరిచిన బండ్లబాట

తోటపల్లిగూడూరు, (ఆంధ్రజ్యోతి): అల్పపీడ ప్రభావంతో శుక్రవారం నుంచి ఎడతెరపిలేని వర్షం కురుస్తుండడంతో మండలంలోని కొత్తపాలెం, పొట్లపూడి, వెంకన్నపాలెం, కోడూరు, ఈదూరు గ్రామాల్లో వరి నారుమళ్లు నీటమునిగాయి. వర్షం ఇలానే కొనసాగితే నారుమళ్లు దెబ్బతింటాయని రైతులు వాపోతున్నారు. కురుస్తున్న వర్షానికి మండలంలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఈదూరు దళితవాడ కాలనీలో అధిక వర్షం కారణంగా రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇళ్లలోకి నీరు వచ్చి చేరడంతో స్థానికులు అవస్థలు పడ్డారు.

● పునరావాస కేంద్రాలకు తరలింపు

తోటపల్లిగూడూరు మండలంలోని రవీంద్ర పట్టపుపాలెం గిరిజనకాలనీలో శనివారం నాటి వర్షాలతో వీధులన్నీ బురదమయంగా మారాయి. దీంతో యుద్ధప్రాతిపదికన మట్టి తోలి ప్రతి ఇంటికి ప్లాస్టిక్ పట్టలు పంపిణీ చేశారు. గాలివాన తీవ్రత పెరగడంతో గిరిజనులను మహాలక్ష్మీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలోని పునరావాస కేంద్రానికి తరలించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు వీరబోయిన గంగాధర్, గ్రామ నేతలు పాల్గొన్నారు. కాగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బొబ్బేపల్లి సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో పునరావాస కేంద్రంలోని గిరిజన కుటుంబాలకు భోజన వసతి కల్పించారు.

● ఆర్డీవో సందర్శన

కాగా పునరావాస కేంద్రాన్ని ఆర్డీవో నాగ అనూష సందర్శించారు. ఆమె మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని కోరారు. లోతట్టు ప్రాంతంలో ఉన్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. ఆమె వెంట ఇన్‌చార్జి తహసీల్దారు టీవీఎస్ ప్రసాద్, డీటీ శివయ్య, గ్రామ రెవెన్యూ అధికారులు, తదితరులు ఉన్నారు.

● నిలిచిన విద్యుత్ సరఫరా

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా మండలంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం రాత్రి వరకు ఎడతెరపిలేకుండా వర్షం కురిసింది. వర్షంతోపాటు చలిగాలులు వీయడంతో ప్రజలు వణికిపోయారు. మండలంలోని పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. ఇడిమేపల్లి, ఈదగాలి, కాకర్లవారిపాళెం తదితర గ్రామాల్లోని పొలాలు నీటమునిగాయి. కొన్ని గ్రామాల్లో అర్ధరాత్రి, ఉదయం రెండుగంటలకుపైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండల అధికారులు ఎప్పటికప్పుడు లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తూ ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

● ప్రమాదంలో పొర్లుకట్టలు

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలకు మండలంలోని పెన్నా పరీవాహక ప్రాంతం వెంబడి ఉన్న పంచేడు, మినగల్లు జొన్నవాడ, శ్రీరంగరాజపురం, దామరమడుగు, పల్లిపాళెం, పోతిరెడ్డిపాళెం గ్రామాల పరిధిలోని పొర్లుకట్టలకు ప్రమాదం పొంచి ఉంది. అయినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడంలేదు. పాత మినగల్లు ఇసుక రీచ్ వద్ద, కొత్త మినగల్లు వద్ద పెన్నా పొర్లు కట్టలు ధ్వంసమయ్యాయి. అలాగే ఇసుక తరలింపు కోసం పొర్లుకట్టలను తెగ్గొట్టి బాటలు వేశారు. ఈ క్రమంలో పెన్నాకు వరదలు వస్తే మళ్లీ తెగేందుకు గండ్లుపడిన ప్రాంతాలు సిద్ధంగా ఉన్నాయి. అయినా పట్టించుకునే అధికారులే కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

● కుండపోత వర్షం

బుచ్చి మండలంలో శుక్రవారం రాత్రి నుంచి వర్షం కుండపోతగా కురుస్తోంది. దీంతో జనజీవనం స్తంభించింది. వర్షంతో మినగల్లు బీసీ కాలనీ, గిరిజన కాలనీ, కాగులపాడు, పెనుబల్లి దళితవాడ, కొన్ని గ్రామాల్లో మురుగు కాలువలు లేక వర్షపునీరు రోడ్లుపై మోకాటిలోతు నిలిచాయి.

● పొలాల్లో వర్షపునీరు

మనుబోలు, (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో రెండురోజులుగా మండలంలో చిరుజల్లులు పడుతున్నాయి. శనివారం ఎడతెరపిలేకుండా చిరుజల్లులు కురవడంతో చెరువులు, కాలువలు నిండుకున్నాయి. మరో పక్క పొలాల్లో వర్షపునీరు భారీగా చేరింది. ఇప్పటికే నార్లు పోసిన పొలాల నిండా నీళ్లుచేరాయి. చిరుజల్లులు ఎలాంటి నష్టం లేదంటున్న అన్నదాతలు ఒకింత ఆందోళనలో ఉన్నారు. ఇదే వర్షం మరో రెండురోజులు కొనసాగితే నార్లు దెబ్బతింటాయని, మళ్లీ విత్తనాలు చల్లుకునే పరిస్థితి వస్తుందని దిగాలుతో ఉన్నారు. రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని తహసీల్దార్ సీహెచ్. సుబ్బయ్య తెలిపారు.

నగరంలో రోజంతా జడి వాన

● తెరపివ్వని వరుణుడు ● లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు ● నగర వాసులకు తప్పని తిప్పలు



సండే మార్కెట్‌లో నిలిచిన నీరు

నెల్లూరు(సిటీ), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో నెల్లూరులో రోజంతా జడి వాన కురిసింది. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత మొదలైన వర్షం శనివారం ఎడతెరపి లేకుండా వాన కురుస్తూనే ఉంది. నగరంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద 39 మి.మీ, రూరల్లోని మాదరాజుగూడూరులో 38, మాగుంట లేఅవుట్, కొత్తూరువద్దనున్న కరెంటాఫీసు ప్రాంతంలో 35, గాంధీబొమ్మ కూడలిలో 33, పీఎంఆర్ హైస్కూల్ ప్రాంతంలో 28, డ్రైవర్స్‌కాలనీలో 25, పొదలకూరురోడ్డులోని కేన్సర్ ఆసుపత్రి ప్రాంతంలో 7.5 మి.మీ చొప్పున వర్షం పడింది. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి నగర శివార్లలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో నివాసాల్లోకి నీరు చేరింది. కాగా నగరంలోని అండర్ బ్రిడ్జీల వద్ద వర్షపు నీరు నిలవడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నెల్లూరులోని ప్రధాన కూడళ్ల, రహదారులు వద్ద వర్షానికి నీరు నిలవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఇదిలా ఉండగా చలి బాగా పెరగడంతో చిన్నారులు, వృద్ధులు ప్రతికూల వాతావరణానికి గురై అవస్థలుపడ్డారు. గాలుల తాకిడికి కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో కార్పొరేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు.

వానొచ్చినా, వరదొచ్చినా అందరికీ పింఛన్లు : జడ్పీ సీఈవో



కోవూరు : వర్షంలోనూ పింఛన్లు పంపిణీ చేస్తున్న అధికారులు



మనుబోలు : వృద్ధుడికి పింఛను అందిస్తున్న జడ్పీ సీఈవో విద్యారమ

మనుబోలు, (ఆంధ్రజ్యోతి): వర్షం, వరదలు ఏమొచ్చినా ప్రతినెలా ఒకటోతేదీకల్లా లబ్ధిదారులందరికీ పింఛన్లు అందజేస్తామని జడ్పీ సీఈవో విద్యారమ అన్నారు. శనివారం ఆమె మనుబోలులో పింఛన్ల పంపిణీని పరిశీలించారు. వర్షంలో తడుస్తూనే ఆమె ఓ వృద్ధుడికి పింఛను అందించారు. ఒక్కరోజులోనే 90శాతం మందికి పింఛన్లు అందించామని, మిగిలిన పదిశాతం సోమవారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● వేకువ నుంచే పింఛన్లు

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు జోరువానలోనూ వేకువజామున ఐదు గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేశారు. సర్వర్లు సరిగాలేక అనుకున్నకాడికి పింఛన్లు పంపిణీ చేయలేకపోయారు. డివైజ్‌లు లేక ఎవరికివారు సొంత సెల్‌ఫోన్లతోనే పింఛన్లు పంపిణీ చేశారు.

● భారీ వర్షంలోనూ పింఛన్ల పంపిణీ

కోవూరు, (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షం కురుస్తున్నా శనివారం మండల పరిధిలోని గ్రామాల్లో పంచాయతీ , సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు. డిసెంబరు మొదటి తేదీ ఆదివారం కావడంతో శనివారమే పింఛన్లు పంపిణీ చేయమని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు టీడీపీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. పట్టణంలో టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, నాటకరాని వెంకట్, బాలా రవి, ముసలి సుధాకర్ తదితరులు తమతమ ప్రాంతాల్లో జరిగిన పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

● ఎంపీడీవో పర్యవేక్షణ

ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి) : లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీని ఎంపీడీవో నాగలక్ష్మి పర్యవేక్షించారు. అన్ని గ్రామాల్లోనూ సిబ్బంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు కొత్తపల్లి రమేష్‌కుమార్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బందిని అభినందించారు. బసరాలదిబ్బ గిరిజన కాలనీలో వీపీఏ శ్రీనివాసులు గిరిజనులకు పింఛన్లు అందజేశారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు విష్ణువర్ధన్‌రావు, మహేష్, అంకయ్య, శ్రీనివాసులు, బద్రి, మౌలాలీ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

● రాపూరు సీఐ విజయకృష్ణ



రాపూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని రాపూరు సీఐ టీ విజయకృష్ణ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

? : గ్రామాల్లో నేరాల నియంత్రణకు ఏమి చర్యలు చేపట్టారు.

! : గ్రామాల్లో నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం.

? : నేరాలు, సైబర్ నేరాల నియంత్రణకు తీసుకున్న చర్యలేంటి.

! : పాఠశాలలు, కళాశాలలను సందర్శించి మహిళా చట్టాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

? : రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! : ముందుగా జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించాం. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు జిగ్‌జాగ్ పద్ధతిలో బారికేడ్లు ఏర్పాటుచేస్తూ డ్రైవర్‌లకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

? : సైబర్ నేరాలకు గురికాకుండా ప్రజలకు ఎలాంటి సూచనలు ఇస్తున్నారు.

! : ఇటీవల సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోయాయి. కొత్త కోణాల్లో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారు. ప్రజలు తమ మొబైల్‌లో వచ్చిన కొత్త యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవద్దు.

న్యూస్ బాక్స్

ప్రజలకు అందుబాటులో ఉండాలి

సైదాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) తుఫాన్ ప్రభావంతో మండలంలో శనివారం ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండడంతో వీఆర్వోలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. ఆమె మాట్లాడుతూ వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

'ఈగల్' ఏర్పాటు అభినందనీయం

కోవూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, డ్రగ్స్ నిషేధానికి రాష్ట్ర ప్రభుత్వం ఈగల్ పేరుతో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని టీడీపీ నెల్లూరు పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి అన్నారు. టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గంజాయికి విద్యార్థులు, యువకులు బానిసలుగా మారుతున్నారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రాష్ట్రం గంజాయి హబ్‌గా మారిందన్నారు. జిల్లాలో ఈగల్ కేంద్రాల్ని ఏర్పాటుచేసి గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు.

రాపూరు సీఐ దాతృత్వం

రాపూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సాయిబాబా గుడి సమీపంలో గూడు నీడ లేని చల్లా యానాదులకు శనివారం రాపూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి విజయకృష్ణ దుప్పట్లు, భోజనం అందజేశారు. వర్షాకాలం కావడంతో ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తెలుసుకున్న సీఐ టీడీపీ పట్టణ అధ్యక్షుడు కోటినాయుడు, జనసేన మహిళా అధ్యక్షురాలు కొండాపురం కస్తూరి సహకారంతో సుమారు 50 మందికి దుప్పట్లు, దుస్తులు, భోజనాలు ఇచ్చి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాజేష్, దేవా, తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ

నెల్లూరు(విద్య), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కంప్యూటర్ కోర్సులో మూడు నెలలు ఉచిత శిక్షణ అందిస్తామని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కే.శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ శిక్షణను పదో తరగతి ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుని పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు పొందాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన యువకులు డిసెంబరు 2న ఐటీఐ కళాశాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

నెల్లూరు(సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి పెనుపట్ల రచించిన 'తెలుసుకో రాయలసీమ చరిత్ర' పుస్తకాన్ని ఆదివారం టౌనుహాలు వర్ధమాన సమాజంలో ఆవిష్కరిస్తున్నట్లు పద్య కళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో కవులు, రచయితలు, భాషాభిమానులు పాల్గొనాలన్నారు.

గ్రామాల్లో పందుల స్వైరవిహారం

● రోగాల భయంతో ప్రజల ఆందోళన ● ఇప్పటికే కొన్నిగ్రామాల్లో విషజ్వరాల విజృంభన ● పట్టించుకోని అధికారులు


వెంకటాచలం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పలు గ్రామాల్లో పందులు స్వైర విహారం చేస్తుండటంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. మండలంలోని కాకుటూరు, గొలగమూడి, సర్వేపల్లి, చెముడుగుంట తదితర గ్రామాల్లో పందుల సంచారం విచ్చలవిడిగా ఉంది. పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నా వాటి నివారణకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై పలువురు పెదవి విరుస్తున్నారు. పందుల నివారణపై అధికారులు వెనుకంజ వేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. పందుల వలన మెదడువాపు వంటి ప్రమాదకరమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అసలే వర్షాకాలం కావడంతో వీటి సంచారం వల్ల ఎక్కడ వ్యాధులు ప్రబలుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పిల్లలకు విష జ్వరాలు వచ్చే అవకాశాలున్నాయి. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో విషజ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పందుల సంచారం వల్ల విషజ్వరాలు మరింత విజృంభించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా వీటిని నిర్మూలించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. రోడ్ల మీద మలవిసర్జన చేస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. పందుల యాజమానులు వాటిని తీసుకొచ్చి వదిలేసి పట్టించుకోవడం లేదు. మురికి కుంటల్లో పొర్లాడుతూ రోడ్ల మీదకు వస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లకు ప్రహరిగోడలు లేని చోట యథచ్ఛగా ఇళ్ల లోపలికి వస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులకు అడ్డుతగలండంతో ప్రమాదాలకు గురవుతున్నారు. వీటిపై స్థానిక అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే వారు లేరని వాపోతున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి గ్రామాల్లో పందుల నివారణకు చర్యలు తీసుకోవాలి.



కాకుటూరులో సంచరిస్తున్న పందులు

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు(వెంకటేశ్వరపురం), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసాలు, బ్యాంకు లావాదేవీల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ట్రీస్ సంస్థ నిర్వాహకుడు నౌరాజ్ పేర్కొన్నారు. నగరంలోని 54వ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌కాలనీ ప్రాంతంలో శనివారం రిజర్వు బ్యాంకు సౌజన్యంతో ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నౌరాజ్ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దన్నారు. ఓటీపీ చెప్పాలని అడిగేవారి పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్ సఫియామొజర్, మెప్మా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నౌరాజ్

సమాచారహక్కు చట్టంపై అవగాహన సదస్సు

వరికుంటపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రామాపురం, జీ.కొండారెడ్డిపల్లి గ్రామాల్లో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు సమాచారహక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి రవికుమార్ రైతులకు సమాచార హక్కు చట్టం ఉద్దేశాలు, దరఖాస్తు నమోదు పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో సర్పంచి ప్రతాప్‌రెడ్డి, వీఏఏలు వెంకటేశ్వర్లు, హరినాధ్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

మనుబోలు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నలుగురు బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం రాత్రి నె ల్లూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు. మడమ నూరులో కటికాల వెంకటేశ్వర్లుకు రూ. 55వేలు, వీరంపల్లిలో చుట్టు నిర్మలమ్మకు రూ. 25వేలు, రాజవోలుపాడు గోనుగుంట మస్తానయ్యకు రూ. 1.30లక్షలు, గురివిందపూడిలో మందర శ్రావణ్‌కుమార్‌కు రూ. లక్ష చెక్కులను అందించారని శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో యానాదినాయు డు, రఘురామయ్య, చెన్నూరు సుధీర్‌రెడ్డి, రామకృష్ణ, ఎం. వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారని పేర్కొన్నారు.

సీడాప్‌ను సందర్శించిన డీఆర్‌డీఏ పీడీ



శిక్షణ పొందుతున్న యువతులతో డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని సీడాప్ స్కిల్ సెంటర్‌ను డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, జాబ్స్ జిల్లా మేనేజర్ హైమావతితో కలిసి శనివారం సందర్శించారు. యువతులను శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజకుమారి మాట్లాడుతూ మహిళల కుటుంబ సామాజిక, ఆర్థిక బాధ్యతల గురించి వివరించారు. జీవితంలో ముందుకు ఎలా సాగా లో చెప్పారు. వచ్చే కష్టసుఖాలను ధైర్యంగా ఎదుర్కొంటూ నైతిక విలువలను తెలుసుకుని మెలగాలన్నారు. శి క్షకులకు యూనిఫారం దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్రం సిబ్బంది ఎస్.నిరీక్షణ, కె.సౌజన్య, ఎం.ఉమ, మల్లిక, ఎం.తిరుపతిరావు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తిరుపతి

జిల్లా వార్తలు

ఆదివారం 1 డిసెంబరు 2024

రుయాలో ఓపీ కేంద్రం వెలవెల



11 గంటలకే వెలవెలబోతున్న ఓపీ విభాగం

సాధారణంగా రుయాస్పత్రిలో ముందుగా ఓపీ తీసుకోవాలంటే గంటల తరబడి క్యూలో నిల్చోవాలి. కానీ, తుపాను ప్రభావంతో శనివారం ఈదురు గాలులతో కూడిన వర్షానికి రోగులు లేక ఉదయం 11 గంటలకే ఓపీ కేంద్రం వెలవెలబోయింది. సాధారణంగా 1500 మందికి పైగా నమోదయ్యే ఓపీ.. కేవలం 380 మంది రోగులతో ముగిసింది. దీంతో ఓపీ కేంద్రాలు ఖాళీగా దర్శనమిచ్చాయి.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

నిండిన 'కాళంగి'



కేవీబీపురం మండలంలోని కాళంగి జలాశయం నిండింది. సామర్థ్యం 240 ఎంసీఎఫ్టీలు కాగా ప్రస్తుతం 218.50 ఉంది. జలాశయంలోకి 7388 క్యూసెక్కుల నీరు చేరుతోందని డీఈ రత్నారెడ్డి చెప్పారు. శనివారం 18 గేట్లలోని ఎనిమిదింటిని ఆరు అడుగులు ఎత్తి 6550 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఏఈ బాబు తెలిపారు.

- కేవీబీపురం, ఆంధ్రజ్యోతి

మల్లిమడుగు నుంచీ నీటి విడుదల



రేణిగుంట మండలంలోని మల్లిమడుగు డ్యాం ఇప్పటికే పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది. ఈ పరిస్థితుల్లో ఇన్‌ఫ్లో పెరగడంతో రెండు గేట్లను ఎత్తి నీటిని వదిలారు. రాత్రి నీటి మట్టం మరింత పెరిగితే ప్రస్తుతం ఎత్తిన గేట్ల నుంచి మరింత ఎక్కువ శాతం నీటికి విడుదల చేస్తామని డీఈ చంద్రమౌళి తెలిపారు.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి







తడ మండలం చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై భారీగా వర్షపు నీరు చేరడంతో ఆగిన వాహనాలు - తిరుపతి ఆర్టీసీ బస్టాండులోకి చేరిన వర్షపు నీరు

● ఫెంగల్ ఎఫెక్ట్

విడవని వాన

- నిండిన కాళంగి, మల్లిమడుగు, స్వర్ణముఖి బ్యారేజీ
- ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- చెరువులు, రిజర్వాయర్లలోకి చేరుతున్న నీరు
- కూలిన 30 విద్యుత్ స్తంభాలు.. రెండు ఇళ్లు
- విమానం దారి మళ్లింపు, పలు సర్వీసులు రద్దు
- విద్యా సంస్థలకు సెలవు

తిరుపతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): 'ఫెంగల్' ప్రభావంతో జిల్లా అంతటా శుక్రవారం రాత్రి నుంచీ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేని వానలకు తోడు ఈదురు గాలులతో చలి పెరిగింది. జన జీవనానికి తీవ్ర అంతరాయం కలిగింది. ఆగకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకల్లో ప్రవాహాలు మొదలయ్యాయి. 30 చెరువులు నిండిపోయి కలుజులు పారుతున్నాయి. మల్లిమడుగు, కాళంగి రిజర్వాయర్లు, స్వర్ణముఖి బ్యారేజీలు నిండిపోయి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇక, పిచ్చాటూరులోని అరణియార్ ప్రాజెక్టులోకి పాతిక అడుగుల మేరకు నీటి మట్టం పెరిగింది. ఆ ప్రాజెక్టు గేట్లను ఎస్పీ సుబ్బరాయుడు పరిశీలించారు. ఇలాగే వర్షం పడితే శనివారం అర్థరాత్రికి ప్రాజెక్టు నిండిపోయే అవకాశముంది. ఇక, జిల్లాలో 30 దాకా చెరువులు నిండిపోయి కలుజు పారుతున్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు.

నారాయణవనంలో 150.6 మి.మీ

తిరుపతి (కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి: శనివారం వేకువ జాము నుంచి రాత్రి వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. అత్యధికంగా నారాయణవనం మండలంలో 150.6 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా పాకాలలో 27 మిమీ చొప్పున వర్షపాతం నమోదైంది. సూళ్లూరుపేట 145, తడ 140.8, చిట్టమూరు 135.6, వాకాడు 134.2, పుత్తూరు 133.2, వరదయ్యపాళెం 130, పిచ్చాటూరు 123.8, వడమాలపేట 123.8, దొరవారిసత్రం 122.4, సత్యవేడు 109, కేవీబీపురం 107.6 చొప్పున వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటు వర్షపాతం 86 మిమీ.



వాకాడు మండలం తూపిలిపాళెం పునరావాస కేంద్రంలో తలదాచుకున్న బాధితులు

11 విమానాల రద్దు.. ఒకటి దారి మళ్లింపు

రేణిగుంట, ఆంధ్రజ్యోతి: రేణిగుంట విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు వాతావరణం అనుకూలించకపోవడంతో 12 విమాన సర్వీసులు రద్దయ్యాయి. శనివారం 16 సర్వీసులు నడవాల్సి వుండగా ఉదయం నాలుగు మాత్రం వచ్చి వెళ్లాయి. ఆ తర్వాత హైదరాబాదు నుంచీ వచ్చిన ఇండిగో విమానం రేణిగుంటలో ల్యాండ్ కాలేకపోవడంతో 15 నిమిషాలపాటు చక్కర్లు కొట్టాక.. దాన్ని బెంగళూరుకు మళ్లించారు. దీంతో ఇండిగో, స్పైస్ జెట్, ఎయిర్ అలయెన్స్, స్టార్ ఎయిర్ లైన్స్ సంస్థలకు చెందిన 11 సర్వీసులను రద్దు చేశారు.

62 బస్సుల నిలిపివేత

తిరుపతి (రవాణా), ఆంధ్రజ్యోతి: పలుచోట్ల కాజ్‌వేలపై నీటి ఉధ్రుతి, వాగులు, వంకలు పొంగుతుండటంతో 62 ఆర్టీసీ బస్సు సర్వీసులను నిలిపివేశారు. తిరుపతి, తిరుమల, మంగళం, అలిపిరి, శ్రీకాళహస్తి, పుత్తూరు, సత్యవేడు, వాకాడు, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి డిపోల నుంచి పలు నగరాలకు, గ్రామాలకు బస్సులను రద్దు చేశారు. ప్రధానంగా తిరుపతి-చెన్నై నాలుగు ఇంద్ర బస్సులు, తిరుమల-పాపవినాశనం మధ్య 8, తిరుత్తణి-తిరుమల మధ్య మూడు, శ్రీకాళహస్తి-చెన్నై, తిరుపతి మధ్య 4, మిగిలిన మార్గాల్లో ఒక్కోటి చొప్పున రద్దు చేశారు. దాదాపు 150ట్రిప్పులు ఆగాయి.



కేవీబీపురం మండలం బ్రాహ్మణపల్లెలో కింద పడిన విద్యుత్త స్తంభం

కాజ్‌వేపై నీటి ఉధృతితో ఆగిన బస్సు



వరదయ్యపాళెం పట్టణ సమీపంలో మారేడు కాలువలో..

వరదయ్యపాలెం మండలం గోవర్ధనపురం సమీపంలో మారేడు కాలువ పొంగి ప్రవహిస్తోంది. నీటి ప్రవాహం తక్కువగా ఉందని భావించిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ బస్సును ముందుకు తీసుకెళ్లగా.. కాజ్‌వేపై నీటి ఉధృతిలో ఆగిపోయింది. బస్సులోని 40 మంది ప్రయాణికులు భయాందోళన చెందారు. గ్రామస్తులు చేరుకుని వీరిని క్షేమంగా గట్టుకు చేర్చారు. ఇక, శ్రీకాళహస్తి- సూళ్లూరుపేట నడుమ కొన్నంబట్టు వద్ద నిర్మాణంలో ఉన్న కల్వర్టు వద్ద చెరువు నీరు ఉధృతికి రాకపోకలు ఆగిపోయాయి. ఏర్పేడు మండలం పాపానాయుడుపేట నుంచి గుడిమల్లం వెళ్ళే మార్గంలో సీత కాలువ ప్రవాహ ఉధృతి పెరగడంతో రాకపోకలు ఆగాయి. దీంతో తుపాను ప్రభావం తగ్గేవరకు గుడిమల్లం పరశురామేశ్వర ఆలయానికి భక్తులు రావద్దని సూచిస్తూ అధికారులు ప్రకటన విడుదల చేశారు. మోదుగులపాలెం వద్ద స్వర్ణముఖి నది లో లెవల్ కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తోంది. రేణిగుంట మండలం గాజులమండ్యం వద్ద కల్లూరు వంక పొంగడంతో అధికారులు రోడ్డును మూసివేశారు.



కోట మండలం వెంకన్నపాళెంలో నీట మునిగిన వరి పైరు, నారుమడులు

ఆస్తి, పంట నష్టాలు

ఏర్పేడు మండలం సీతారామపేటలో అక్కుపల్లి లోకేశ్‌కు చెందిన ఇల్లు కూలిపోయింది. బీఎన్‌కండ్రిగ మండలం కుంభకంలో చెట్టు విరిగి రేకుల ఇంటిపై పడడంతో ధ్వంసమైంది. తొట్టంబేడు మండలం రౌతు సూరమాల, బీఎన్‌కండ్రిగ మండలం నెరబై కండ్రిగ, కోట మండలం వెంకన్న పాలెం, చిట్టమూరు మండలం, పెళ్ళకూరు మండలం జీలపాటూరు, వరదయ్యపాలెం మండలం అయ్యవారిపాలెం తదితర గ్రామాల్లో వరి పొలాలు నీట మునిగాయి.

నేడూ జిల్లాకు తుపాను ముప్పు

శనివారం రాత్రి ఫెంగల్ తుపాను తీరం దాటినా.. ఆదివారం కూడా జిల్లాకు భారీ వర్షాల ముప్పు పొంచి వుంది. తీవ్రత తక్కువైనా వర్షాలు ఆగకుండా ఇలాగే ఆదివారం కూడా పడితే మాత్రం వాగులు, వంకలు పూర్తిస్థాయిలో ప్రవహించే అవకాశముంది. చెరువులకు, కల్వర్టులకు గండ్లు పడే ప్రమాదముంది. పల్లపు ప్రాంతాలు జలమయం కావడంతో పాటు పంటలు దెబ్బతినొచ్చు. దీంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.


విద్యుత్ సరఫరాలో అంతరాయం

తిరుపతి(ఆటోనగర్), ఆంధ్రజ్యోతి: గాలుల తాకిడికి జిల్లాలో 30 విద్యుత్ స్తంభాలు, పలు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. దీంతో పలుచోట్ల కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు విరిగి పడటంతో సరఫరా ఆగింది.

ఆలస్యంగా రైళ్ల రాకపోకలు

తిరుపతి(సెంట్రల్), ఆంధ్రజ్యోతి: చెన్నై నుంచి బయలు దేరవలసిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను తిరువళ్ళూరు నుంచి నడిపినట్లు అధికారులు తెలిపారు. తిరుపతి- చెన్నై మధ్య నడుస్తున్న సప్తగిరి, గరుడాద్రి ఎక్స్‌ప్రెస్‌లు శనివారం తిరువళ్ళూరు నుంచి తిరుపతికి రాకపోకలు సాగించాయి.

పుదుచ్చేరి వద్ద తీరాన్ని తాకి..



పులికాట్‌లో అలల ఉధృతి

సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి: ఫెంగల్ తుపాను పుదుచ్చేరి సమీపంలో తీరాన్ని తాకింది. శనివారం అర్ధరాత్రి తీరాన్ని దాటొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇస్రో ఉపగ్రహాల ద్వారా తుపాను తీవ్రతను, తీరం దాటే సమాచారాన్ని ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తున్నారు. గడిచిన 8 గంటల్లో గంటకు 7 కిలో మీటర్ల వేగంతో కదిలిన ఫెంగల్ తుపాను.. రాత్రి 11.30 గంటలకు తీవ్ర వాయుగుండంగా బలహీనపడుతుందని వాతావరణశాఖ అంచనా. ఈ తుపాను తీరాన్ని తాకడంతో తమిళనాడు, ఆంధ్రాలో తీరం వెంబడి దీని ప్రభావం ఉంటుందని, సముద్రంలో వాతావరణం అల్లకల్లోలంగా ఉండడంతో ఏపీ, తమిళనాడు తీర ప్రాంతాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. తీరం దాటే సమయంలో గంటకు 70 నుంచి 80 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. తీర ప్రాంతాల్లో దాదాపు 20 సెంమీ వర్షపాతంతో పాటు ఆకస్మిక వరదలు వచ్చే అవకాశముందని హెచ్చరికలు జారీ చేశారు. సముద్రం, పులికాట్ సరస్సులో మత్స్యకారులు మరో రెండు రోజుల పాటు వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాల్లో అధికారులను అప్రమత్తం చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకొన్నారు. తహశీల్దార్ ఎస్‌వి నరసింహరావు లోతట్టు ప్రాంతాలను పరిశీలించి అక్కడ ప్రజలతో అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నారు.



సూళ్లూరుపేట కోర్టు వద్ద..

మాడవీధుల్లో సింహ వాహన సేవ రద్దు

వాహన మండపంలోనే పద్మావతీ దేవి దర్శనం



సింహవాహనంపై పద్మావతిదేవి, వాహన మండపంలోనే అమ్మవారికి భక్తుల హారతులు

తిరుచానూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తుపాను నేపథ్యంలో శనివారం ఉదయం నుంచీ జడివాన కురుస్తుండడంతో రాత్రి తిరుమాడవీధుల్లో జరగాల్సిన సింహవాహన సేవను వాహన మండపానికే పరిమితం చేస్తున్నట్లు టీటీడీ ప్రకటించింది. సాయంత్రం ఊంజల్ సేవ జరిగాక సింహవాహనంపై అమ్మవారిని కొలువుదీర్చారు. వాహన మండపం నుంచే భక్తులకు దర్శనమిచ్చారు. మాడవీధుల్లో వేచివున్న భక్తులు వాహనమండపానికి చేరుకుని కర్పూర, నారికేళ హారతులు సమర్పించారు. వర్షం కారణంగా సాయంత్రం నుంచే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ఆలయ పరిసరాలు బోసిపోయాయి. వాహన సేవ ముందు సాంస్కృతిక ప్రదర్శనలకోసం వచ్చిన ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులకు మహతిలో జరుగుతున్న కార్యక్రమాల్లో అవకాశం కల్పించారు.

- మరిన్ని బ్రహ్మోత్సవాల విశేషాలు 6లో..





నందికి జలపాతాభిషేకం

పులకించిన నగరం

కొండకోనల్లో కురిసిన చినుకులు పాయలై పారి.. వాగులై ఉరికి.. జలపాతాలై దూకాయి. రాత్రి నుంచీ కురుస్తున్న వానలో తడిచి, తలకిబోసుకున్న ప్రకృతి కన్యలా తిరుమల కొండలు కళకళలాడుతున్నాయి.. మాలాడగుండం, కపిలతీర్థం జలపాతాలు తిరుమల భక్తులకు స్వాగతం పలుకుతున్నాయి. కొండ సిగలో మెరుస్తున్న ఈ తెల్ల జలవంకలను చూస్తూ నగరవాసులు మురిసిపోతున్నారు. వాన పెంచిన చలికి జనం మరింత ముడుక్కుని గడుపుతున్నారు. చిన్నాచితకా వ్యాపారాలన్నీ గొడుగుల కిందకు చేరుకున్నాయి. శనివారం నాటి వాన దృశ్యాలను ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్లు అందిస్తున్నారు.



గోపురానికి నమస్కరిస్తున్న కపిలతీర్థం



గొడుగుల కింద తలదాచుకున్న కూరగాయల మార్కెట్



ముత్యపు పందిరిపై పద్మావతమ్మ

రాలిన చినుకు.. నత్త గర్భంలో ముత్యంగా మారుతుంది. కురుస్తున్న చినుకుల్లో ఆ ముత్యాల వాహనంలోనే పద్మావతీ దేవి తిరుచానూరు మాడవీధుల్లో ఊరేగారు. కార్తీక బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం ముత్యపు పందిరిపై అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వర్షంతో పటాటోపం కిందనే ఊరేగింపు సాగింది. మేళతాళాలు, భజన, కళాబృందాలు తడుస్తూనే ప్రదర్శనలు ఇచ్చారు. పండితులు గొడుగుల కిందకు చేరి వేదపారాయణం సాగించారు. కార్యక్రమాల్లో జీయర్ స్వాములు, టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

వాహనసేవలో కళా నీరాజనం

ముత్యపు పందిరి వాహనసేవలో వివిధ రాష్ట్రాలకు చెందిన 12 కళా బృందాలలోని 272 మంది కళాకారులు అమ్మవారికి కళా నీరాజనం సమర్పించారు. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన కళాకారులు కథక్, భరతనాట్యం, కూచిపూడి కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. కంజీర కోలాటం, పిల్లనగ్రోవి వంటి జానపద నృత్యాలను ప్రదర్శించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న జల్లుల మధ్య తిరుపతి ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలకు చెందిన విద్యార్థులు పౌరాణిక పాత్రలను పోషించి భక్తులను అలరించారు.

వర్షంలోనూ.. ఒకరోజు ముందుగానే..!

- ఇంటింటికీ పింఛన్ల పంపిణీ
- జిల్లాలో 92 శాతం పూర్తి



ఓజిలిలో పింఛను అందజేస్తున్న డీఎల్పీడీవో జాలిరెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి

తిరుపతి, నవంబరు30(ఆంధ్రజ్యోతి): డిసెంబరు ఒకటో తేది ఆదివారం సెలవుదినం. దీంతో ఒకరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఎడతెరపని వర్షంలోనూ ఉదయం 5 గంటల నుంచే సచివాలయ సిబ్బంది ఆయా పరిధిలోని లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందించారు. పలుచోట్ల కూటమి నేతలు పంపిణీని పర్యవేక్షించారు. వాన పడుతున్నా జిల్లాలో 92 శాతం పంపిణీ పూర్తి చేశారు. 264636 మంది లబ్ధిదారులకు గాను 243491 మందికి జిల్లాలో అందించినట్టు డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు తెలిపారు. ఆది, సోమవారాల్లోనూ పింఛన్లు పంపిణీ పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు.

స్వర్ణమ్మకు హారతులు



గంగాదేవికి పూజలు

శ్రీకాళహస్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):కార్తీక మాసం అమావాస్యను పురస్కరించుకుని శ్రీకాళహస్తిలో శనివారం సాయంత్రం స్వర్ణమ్మకు హారతులు సమర్పించారు. ముక్కంటి ఆలయంలో గంగాదేవి ఉత్సవ మూర్తిని అలంకరించి స్వర్ణముఖి నదిలోని సద్యోముక్తి ప్రదేశం వరకు తీసుకొచ్చారు. పండితులు నదీజలాలకు, అమ్మవారి ఉత్సవ మూర్తికి పూజలు చేశారు. అర్చకులు స్వర్ణమ్మకు ద్వాదశ హారతులు పట్టారు. ఆగమ నియమాల ప్రకారం గంగమ్మకు వరుసగా హారతులను సమర్పించారు.వేదఘోష మధ్య దీపకాంతులను దర్శిస్తూ పలువురు భక్తులు నదిలో దీపాలు వెలిగించి వదిలారు. నదీ హారతుల సందర్భంగా ఈ ఏడాది ఏర్పాటు చేసిన లేజర్‌షో ఆకట్టుకుంది. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, బొజ్జల బృందమ్మ, ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి, టీడీపీ నాయకులు విజయకుమార్, చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తిలో శనివారం వేకువజాము నుంచి సాయంత్రం వరకు వర్షం విడవకుండా కురిసింది. నదీ హారతుల కోసం ఆలయం నుంచి గంగాదేవి ఉత్సవమూర్తి బయలుదేరిన వెంటనే నిలిచిపోయి.. హారతుల ఘట్టం ముగిశాక వర్షపు జల్లులు పడటం గమనార్హం.



యువకుడి దారుణహత్య

ఉసురు తీసిన వివాహేతర సంబంధం

శ్రీకాళహస్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం కారణంగా యువకుడు హత్యకు గురయ్యాడు. శ్రీకాళహస్తి మండలం చుక్కల నిడిగల్లు పంచాయతీ ఓటుగుంట సెంటర్‌కు చెందిన రవి(20) భవన నిర్మాణ కార్మికుడు. ఇదే సెంటర్‌కు చెందిన ఆర్ముగం అతనికి సమీప బంధువు. కొంతకాలంగా ఆర్ముగం కుటుంబసభ్యురాలితో రవి వివాహేతర సంబంధం కొనసాగించేవాడు. దీనిపై ఆగ్రహించిన ఆర్ముగం శనివారం రాత్రి రవి ఇంటి వద్దకు కత్తితో వెళ్లాడు. మాటా మాటా పెరగడంతో రవిపై కత్తితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవి నాయక్, ఏఎస్ఐ మధు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆర్ముగంను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

స్విమ్స్‌కు రూ.10 లక్షల విరాళం

తిరుపతి(వైద్యం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హైదారాబాదుకు చెందిన ఇడిముక్కల హాసిని రూ.10 లక్షల విరాళం అందజేశారు. స్విమ్స్‌లో శనివారం డైరెక్టర్ ఆర్వీకుమార్‌ను కలిసి డీడీని అందించారు. హాసిని మాట్లాడుతూ తన తాత ఇడిముక్కల యతిరాజయ్య జ్ఞాపకార్థం ఈ నగదును అందిస్తున్నట్లు తెలిపారు. హాసిని కుటుంబ సభ్యులు శ్రీనివాసరావు, ప్రవంతి, రాజేష్ బాబు పాల్గొన్నారు.



రేణిగుంట మండలం గాజులమండ్యం- కల్లూరు గ్రామాల మధ్య వాగు ఉధృతితో మూసేసిన రోడ్డు

ఒకటే వాన

జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి వానలు విస్తారంగా పడుతున్నాయి. దీంతో వాగులు, వంకల్లో నీటి ప్రవాహం మొదలైంది. పలుచోట్ల రోడ్లపై నీళ్లు చేరాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పలు చోట్ల పొలాల్లోకి నీళ్లు చేరాయి. జనజీవనానికి ఇబ్బందగా మారింది. చిరు వ్యాపారులు అవస్థలు పడ్డారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్ వర్క్



దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాళెం వద్ద వెదురుపట్టు రోడ్డులోని వంతెనపై ప్రవహిస్తున్న పాల కాలువ.. పాలకాలువ వరదను పరిశీలిస్తున్న తహసీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో గోవర్దన్ తదితరులు



నాయుడుపేట లోతువానిగుంట బీసీ బాలుర వసతిగృహం వద్దకు చేరుకున్న వర్షపునీరు



కోట మండలం విద్యానగర్ స్టేట్‌బ్యాంకు వద్ద..



తిరుపతిలో



పుత్తూరు పట్టణ సమీపంలో భవానీనగర్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఉప్పుకాలువ



బీఎన్‌కండ్రిగ మండలం కనమనంబేడులోని చెరువు కట్టపై కూలిన వృక్షం



నారాయణవనం మండలం తిరువట్యం కాజ్‌వేను పరిశీలిస్తున్న ఎస్ఐ రాజశేఖర్



పునరావాస కేంద్రంలో ఉన్న ఓజిలి మండలం నెమళ్ళపూడి గిరిజనులు



తిరుపతిలో..



ఏర్పేడు మండలం మోదుగులపాళెం వద్ద స్వర్ణముఖి నది లోలెవల్ కాజ్‌వేపై ప్రవహిస్తున్న వర్షపునీరు

చిట్టమూరులో హై అలర్ట్



చెరువులను పరిశీలిస్తున్న తహసీల్దారు ప్రసాద్, ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఎస్ఐ బలరామయ్య

చిట్టమూరు, నవంబర్ 30(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ నేపథ్యంలో శనివారం మండలంలో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తుండడంతో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఎస్ఐ చిన్న బలరామయ్య ఇతర అధికారులతో కలిసి పలు చెరువులను, కొత్తగుంట మల్లాం మార్గంలో ఉన్న రొయ్యల కాలువ వంతెనను పరిశీలించారు. అదేవిధంగా కోగిలి, తాడిమేడు మార్గంలోని చప్టాల వద్ద నీటి ప్రవాహం ఉండడంతో రోడ్డుకు అడ్డంగా కంపలు వేయించారు. కాజ్‌వేలు, వరద కాలువలపై నీటి ప్రవహాన్ని దాటవద్దని ప్రజలను హెచ్చరించారు. పలు చోట్ల రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్లను కొట్టించి రాకపోకలను పునరుద్ధరించారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

గూడూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ తీరప్రాంత గ్రామాల్లోని మత్స్యకారులు వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. తుఫాన్ కారణంగా ఎవరైనా ఇబ్బందులు పడుతుంటే వారికి అవసరమైన ఆహార పొట్లాలను, దుప్పట్లు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఎవరికి ఏ అవసరం వచ్చినా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంప్రదిస్తే సాయం అందిస్తామన్నారు.

సూళ్లూరుపేటలో రెండు చోట్ల చోరీ

సూళ్లూరుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని శుక్రవారం రాత్రి రెండు చోట్ల చోరీ జరిగింది. ఇసుకమిట్టలోని బాలత్రిపుర సుందరి ఆలయంలో తాళాలను పగలగొట్టి అమ్మవారికి అలంకరించిన్న బొట్టు, కనురెప్పలు, వడ్డాణం, దండ(మొత్తం 50 గ్రాముల బంగారు ఆభరణాలు) ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం అర్చకులు, నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. అదేవిధంగా సూళ్లూరుపేట బొగ్గుల కాలనీలో నివాసం ఉంటున్న రేషన్ డీలర్ కె.రమేష్ కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వెళ్లారు. ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో బీరువాలో ఉన్న 3 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.2లక్షలు నగదు ఎత్తుకెళ్లారు. శనివారం ఇంటికి వచ్చిన రమేష్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వేలిముద్రల నిపుణలను రప్పించి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటగిరిని అన్నివిధాలా అభివృద్ధి చేస్తా: కురుగొండ్ల



చింతగుంట గ్రామంలో ఫించన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని రాణీపేట, చింతగుంట గ్రామాల్లో లబ్ధిదారులకు పించన్ల పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.10.80 లక్షల చెక్కులు ఎనిమిది మందికి అందచేశారు.

డయాలసిస్ సెంటరు ఏర్పాటుకు కృషి

వెంకటగిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో డయాలసిస్ సెంటరు ఏర్పాటు చేయడంతో పాటు పట్టణంలోని గోషా ఆస్పత్రికి పూర్వ వైభవం తీసుకువస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు వైద్య సేవలు అందించాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంగాధరం, నాయకులు కోటి తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ నేత కుటుంబానికి నెలవల పరామర్శ

పెళ్లకూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరసనంబేడు గ్రామంలో ఈనెల 25వ తేదీన మృతి చెందిన టీడీపీ నాయకుడు వేలూరు జనార్దన్‌రెడ్డి కుటుంబసభ్యులను సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం శనివారం పరామర్శించారు. జనార్దన్‌రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జనార్దన్‌రెడ్డి కుమారులు వేలూరు మురళీకృష్ణారెడ్డి, హరిబాబురెడ్డిలను పరామర్శించారు. నెలవల వెంట టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు నేలవల్లి సిద్దులయ్య నాయుడు, నరేంద్రయాదవ్, మదన్‌మోహన్ నాయుడు, సుధాకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, మల్లు కృష్ణయ్య ప్రసాద్, గుంటపూడి రమణయ్య ఉన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గూడూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో ప్రజలంతా అప్రమతంగా ఉండాలని తహసీల్దారు చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ తుఫాన్ కారణంగా మూడు రోజులపాటు ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తామన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని, ఎవరికైనా సమస్య వస్తే 7416108251 నంబరును సంప్రదించాలన్నారు.

పౌర హక్కులపై అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు జయజయరావు

కోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలు పౌర హక్కులపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దారు జయజయరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని ఊనుగుంటపాళెం గిరిజనకాలనీలో పౌరహక్కుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రాజ్యాంగ పరంగా సంక్రమించిన పౌర హక్కులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం గిరిజనకాలనీలో ఇంటింటా తిరిగి మౌళిక వసతులపై ఆరాతీశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్, ఆర్ఐ మధులత, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

వాకాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆముదాలపాడు గ్రామంలో గోపీనాథ్ ఇంటిపై దాడులు చేసి పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు.



నాయుడుపేటలో జలమయమైన రావువారివీధి





పెళ్లకూరు: జీలపాటూరులో నీటమునిగిన వరి - దొరవారిసత్రం: పూలతోట వద్ద సూళ్లూరుపేట - వాకాడు రహదారిని దాటుతున్న మాంబట్టు సెజ్ కార్మికులు

ఎడతెరపిలేని వర్షం

- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నీటి మునిగిన పంటలు
- స్తంభించిన జనజీవనం

సూళ్లూరుపేట, నాయుడుపేట, నాయుడుపేట టౌన్, తడ, దొరవారి సత్రం, ఓజిలి, వాకాడు, పెళ్లకూరు, గూడూరు, చిల్లకూరు, బాలాయపల్లి, వెంకటగిరి టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. సూళ్లూరుపేటలో శనివారం ఉదయం నుంచే ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో అంబేడ్కర్ గురుకులం వద్ద రోడ్డుపై భారీగా వర్షపునీరు నిలవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. కోట పోలూరు రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో పుచ్చాకాలువ పొంగి రోడ్డు పైకి నీరు చేరడంతో రాక పోకలను నిలిపివేశారు. సూళ్లూరుపేట నుంచి కోటకు వెళ్లే బస్సులను మన్నె ముత్తేరి మీదుగా పంపించారు. సూళ్లూరుపేట పట్టణంలో జీఎన్‌టీ రోడ్డుపై వర్షపునీరు నిలవడంతో మున్సిపాలిటీ అధికారులు ఎక్స్‌కవేటర్ సాయంతో మట్టిని తవ్వి నెర్రికాలువలోకి నీటిని పంపే ఏర్పాట్లు చేశారు. ఈదురు గాలులు వీయడంతో పలుచోట్ల చెట్లు నేలకొరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అధికారులు వెంటనే మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు. సూళ్లూరుపేట - శ్రీకాళహస్తి మార్గంలో కొణ్ణంబట్టు వద్ద నిర్మాణంలో ఉన్న కల్వర్ట్ వద్ద డైవర్షన్ రోడ్డుపై నీరు చేరడంతో దాదాపు గంటకు పైగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. డైవర్షన్ రోడ్డుకు సమాంతరంగా నీరు చేరడంతో తెగిపోయే ప్రమాదం ఉండడంతో మంగళంపాడు, దామానెల్లూరు వైపు వాహనాలను పంపేందుకు తహసీల్దార్ నరసింహరావు చర్యలు చేపట్టారు. చెరువులు నిండుకుండల్లా మారాయి. పంటపొలాలు నీటమునిగాయి. ఇప్పటి వరకు ఎటువంటి ప్రమాదం జరగలేదని, ఎటువంటి విపత్తునైన ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్డీవో కిరణ్మయి తెలిపారు. ● నాయుడుపేట పట్టణంలోని రహదారులు జలమయం అయ్యాయి. మండలంలో లోతట్టు ప్రాంతాలను తహసీల్దారు రాజేంద్ర పరిశీలించారు. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. చెరువులు, వాగులు, వంకల్లో వర్షపునీరు చేరుతోంది. ● తడలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు వర్షం విడవకుండా పడుతూనే ఉంది. చెన్నై - కోల్‌కత్తా జాతీయ రహదారిపై తడ ఆదిత్యనగర్ వద్ద భారీగా వర్షపునీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు ఎక్స్‌కవేటర్ సాయంతో రహదారిపై ఉన్న డివైడర్‌ను కొంతమేర తొలగించి వర్షపునీరు కాలువల్లోకి మళ్లించి రాకపోకలను పునరుద్ధరించారు. కేవీబీపురం మండలం వద్ద ఉన్న కాళంగి రిజర్వాయర్ 8 గేట్‌లను 5 అడుగుల మేర ఎత్తి 4వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పాములకాలువ, కాళంగినది పరివాహక ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలైన కాదలూరు, వెండ్లూరుపాడు, మాంబట్టు, వాటంబేడు గ్రామాల్లో ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ● దొరవారిసత్రం మండలంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 197 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. వరద నీటితో కాళంగి నది, నెర్రికాలువ, పాలకాలువ, కన్నా కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తనియాలి వద్ద కాళంగి వంతెనపై వరద నీటి ప్రవాహంతో ఏడు గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. పూలతోట సమీపంలో సూళ్లూరుపేట - వాకాడు ఆర్అండ్‌బీ రహదారిలో ఉన్న వంతెనపై కన్నకాలువ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కట్టువపల్లి, సింగనాలత్తూరు, మేలనాలత్తూరు, కలగుర్తిపాడు, చిల్లమూరు, ఆరూరు ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మాంబట్టు సెజ్‌లోని భారతి కంపెనీ కార్మికులు తాళ్ల సాయంతో రహదారిని దాటారు. అలాగే కుప్పారెడ్డి పాళెం సమీపంలో వెదురుపట్టు రోడ్డు ఉన్న వంతెనపై పాలుకాలువ వరద ప్రవహిస్తుండడంతో మూడు గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. అక్కడక్కడ చెట్లు కూలడం, వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా ఆపేశారు. ● కోట మండలంలో మోస్తారు కురిసింది. స్వర్ణముఖినది పరివాహక గ్రామాలైన గూడలి, దక్షిణపొలం, తిన్నెలపూడి, లక్ష్మక్కకండ్రిగ, తాటితోపు, రంగన్నగుంట, వెంకన్నపాళెం తదితర గ్రామాల్లో వరి నారుమడులు, వరినాట్లు నీట మునిగిపోయాయి. సిద్దవరం, గోవిందపల్లి గ్రామాల మీదుగా బంగాళాఖాతంలో కలిసే బకింగ్‌హామ్ కెనాల్‌కు వరద పోటెత్తడంతో కెనాల్ నిండుకుండలా మారింది. శ్రీనివాససత్రం, గోవిందపల్లిపాళెం గ్రామాల సమీపంలో ఉన్న సముద్రంలో భారీ ఎత్తున అలలు ఎగిసిపడ్డాయి. గూడలి వద్ద స్వర్ణముఖినదిలోని మామిడి కాలువలోకి ఎగువప్రాంతాల నుంచి వరదనీరు పోటెత్తింది. కాలువ దిగువ భాగమైన చల్లకాలువనది మీదుగా పెన్నక్కచెరువులోకి వరదనీరు ప్రవహిస్తోంది. ● ఓజిలి మండలంలో శనివారం రోజంతా వర్షం పడుతూనే ఉంది. మండలంలోని మానమాల - కొండవల్లిపాడు, నెమళ్ళపూడి - పున్నేపల్లి, కురుగొండ - చిట్టమూరు మండలం గునుపాడు మార్గంలో వాగులు, మామిడి కాలువ ప్రవాహం కారణంగా ఆయా మార్గాలను రాకపోకలను ఆపేశారు. నెమళ్ళపూడి గ్రామానికి ముంపు ప్రమాదం పొంచి ఉండడంతో 8 గిరిజనుల కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించినట్లు తహసీల్దారు పద్మావతి తెలిపారు. ● వాకాడు మండలంలో కురిసిన భారీ వర్షాలకు తూపిలిపాళెం లోతట్టు ప్రాంతమైన ఎస్‌టీ కాలనీ ఇళ్లలోకి నీరు చేరడంతో ముంపు బాధితులను ఎంపీయూపీ పాఠశాలలోకి తరలించారు. వాకాడు స్వర్ణముఖిబ్యారేజీ, కల్లూరు చెరువుకట్ట తూములను సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో అన్నపూర్ణరావు, ఇరిగేషన్ ఏఈలు శ్రీనివాసరావు, కృష్ణయ్య తదితరులు ఉన్నారు. స్వర్ణముఖి నదిలో ఇప్పటికే 0.035 టీఎంసీల నీరు ఉండటంతో వరదనీటిని దిగువకు వదులుతున్నట్లు ఇరిగేషన్ ఏఈ కృష్ణయ్య తెలిపారు. 1800 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండటంతో 4గేట్‌లను ఎత్తి సముద్రంలోకి నీటిని వదులుతున్నామన్నారు. ● పెళ్లకూరు మండలంలో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. వరి నాట్లు వేసిన పంట పొలాలు నీటమునిగాయి. కలవకూరు, కప్పగుంటకండ్రిగ గ్రామాల వద్ద ఉన్న కాజ్‌వేలను తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి పరిశీలించారు. పెసల గుర్రప్పతోట వద్ద జాతీయ రహదారి నుంచి కప్పగుంటకండ్రిగ మీదుగా వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. ● గూడూరు పట్టణంలో శనివారం వేకువజాము నుంచి ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. వర్షానికి తోడు చలిగాలులు వీస్తుండడంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులుపడ్డారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వర్షపునీరు ప్రవహిస్తుండడంతో పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ● చిల్లకూరు మండలంలో శనివారం ఉదయం నుంచి మోస్తరు వర్షం కురిసింది. వరగలి క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డుపై వర్షపునీరు చేరడంతో వాహదారులు అవస్థలు పడ్డారు. అదేవిధంగా పారిచెర్లవారిపాళెం సమీపంలోని రోడ్డుపై గుంతలు ఏర్పడి వర్షపునీరు చేరడంతో పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ● బాలాయపల్లి మండలంలో ఉదయం నుంచి మోస్తరు కురిసింది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు శ్రీనివాసులు సూచించారు. ● వెంకటగిరిలో మోస్తరు వర్షం కురిసింది. పట్టణంలోని స్థానిక అన్న క్యాంటీన్, మున్సిపాలిటీ కార్యాలయం దారిలో, రైల్వేస్టేషన్ రోడ్డులో వర్షపు నీరు చేరింది. వెలుగొండ అడవుల్లో నుంచి వర్షపు నీరు కౌవల్యానదికి చేరుతోంది. తుఫాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో కోటీశ్వరరావు సూచించారు.



వాకాడు స్వర్ణముఖి బ్యారేజీ వద్ద అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా







కోట: గూడలి స్వర్ణముఖి వద్ద పరవళ్లు తొక్కుతున్న మామిడికాలువ - సూళ్లూరుపేట: పుచ్చాకాలువ పొంగి కోటపోలూరు రోడ్డులో పారుతున్న నీరు - గూడూరు: ఆర్టీసీ బస్టాండు సమీపంలో జలమయమైన రోడ్డు

రూ.307 కోట్లతో మున్సిపాలిటీల అభివృద్ధి: నెలవల



పింఛను అందజేస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలటీల పరిధిలో రూ.307 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సీఎం చంద్రబాబునాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం మండలంలోని శిరసనంబేడు గ్రామంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో సూళ్లూరుపేట మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.165 కోట్లు, నాయుడుపేట మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.142 కోట్లు మంజూరు కాగా పనులు ప్రారంభించామన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక జగన్ ఆ పనులకు ఆపేశారని విమర్శించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీతో కలసి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్పందించిన ఆయన అభివృద్ధికి సంబంధించిన నిధుల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని, అప్పట్లో మంజూరైన పనులను యథావిధంగా కొనసాగించేందుకు అధికారులకు ఆదేశాలు ఇస్తామని హామీ ఇచ్చారని నెలవల తెలిపారు. దీంతో పాటు స్వర్ణముఖి నదిలో నీటిని నిల్వచేసి పెళ్లకూరు, నాయుడుపేట మండలాలకు సాగు, తాగు నీటిని అందించేందుకు శ్రీకారం చుట్టామన్నారు. ఇందులో భాగంగా నాయుడుపేట మండలం మర్లపల్లి, పెళ్లకూరు మండలంలోని తాళ్వాయిపాడు, జీలపాటూరు, పెళ్లకూరు ప్రాంతాల్లో స్వర్ణముఖినదిలో చెక్‌డ్యామ్‌లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించామన్నారు. నియోజకవర్గ పరిధిలో ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్న తెలుగుగంగ కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే విజయశ్రీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని, ఈ పనులన్నీ ప్రారంభిస్తామన్నారు. అనంతరం శిరసనంబేడు గ్రామంలో సచివాలయ ఉద్యోగులతో కలసి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు నేలవల్లి సిద్దులయ్య నాయుడు, నరేంద్ర యాదవ్, ఎం.మదన్ మోహన్ నాయుడు, సుధాకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, మల్లు కృష్ణయ్య ప్రసాద్, గుంటపూడి రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.





గూడూరులో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, సూళ్లూరుపేట మన్నారుపోలూరులో ఎమ్మెల్యే విజయశ్రీ ఫించన్లను అందజేత

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గూడూరు, సూళ్లూరుపేట, తడ, చిల్లకూరు, చిట్టమూరు, దొరవారి సత్రం, ఓజిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన గూడూరు పట్టణంలోని రెండో వార్డులో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివారం సెలవు దినం కావడంతో ఒక్కరోజు ముందుగానే లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్నామన్నారు. డిసెంబరు 2వ తేదీ నుంచి పింఛన్లు, రేషన్‌కార్డుల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సీఐ శేఖర్‌బాబు, నాయకులు అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, జహంగీర్, అల్లీహుస్సేన్, ఇశ్రాయిల్‌కుమార్ పాల్గొన్నారు. ● సూళ్లూరుపేట మన్నారుపోలూరులో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మున్సిపల్ కమిషన్ చిన్నయ్య పింఛన్లు పంపిణీ చేశారు. ● తడ మండలంలో 98శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో విజయ కుమార్ తెలిపారు. ● చిల్లకూరు మండలంలో తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యదర్శి చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, సచివాయ సిబ్బందితో కలిసి పింఛన్లు అందజేశారు. ● చిట్టమూరు మండలంలో 90శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు ఎంపీడీవో మనోహర్‌గౌడ్ తెలిపారు. ● దొరవారి సత్రం మండలంలో 91.07 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. ● ఓజిలిలోని ఎస్ఎస్ఆర్ గిరిజన కాలనీలో డీఎల్‌డీవో జాలిరెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు

గూడూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమాశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రి భవన నిర్మాణ పనులను త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం

వాకాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు అలవాటుపడితే జీవితం నాశనం అవుతుందని ఎక్సైజ్ సీఐ ప్రసాద్ అన్నారు. వాకాడులోని అంబేడ్కర్ గురుకులంలో శనివారం విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల రవాణా, వినియోగం, నివారణకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందన్నారు. మాదక ద్రవ్యాలు సరఫరా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

దళిత ఉద్యమకారుడు ఆర్‌వీ కన్నుమూత



రమణయ్య(ఫైల్‌ఫొటో)

కోట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దళిత బహుజన ఉద్యమకారుడు ఆర్‌వీ రమణయ్య కన్నుమూశారు. ఎన్నో ఉద్యమాలకు ఊపిరి పోసిన రమణయ్య అలియాస్ రాయపు వెంకట రమణయ్య(65) కోట పట్టణంలోని ఎస్‌సీఆర్ నగర్‌లో ఉన్న ఆయన నివాసంలో శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం పంచాయతీ విశ్వనాథపుర అగ్రహారానికి చెందిన రమణయ్య ఉపాధ్యాయ వృత్తిలోనే కొనసాగుతూనే ఎన్నో దళిత, బహుజన ఉద్యమాలకు బాటలు వేశారు. ఉద్యోగ విరమణ తరువాత ఎన్నో భూ పోరాటాలు సాగించారు. భూస్వాములకు వ్యతిరేకంగా చేసి సముద్రతీర ప్రాంత మండలాలలో అంబేద్కర్‌ను పరిచయం చేసిన ఘనత ఆర్‌వి రమణయ్యకు దక్కింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతదేహానికి పలు పార్టీల నేతలతో పాటు ప్రజాసంఘాలు, కులసంఘాల ప్రతినిధుల నివాళులర్పించారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిల్ రెడ్డి, పక్కన ఎంపీడీవో

సూళ్లూరుపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా నిర్వహిస్తున్న సర్వేలో అధికారులు అర్హులను గుర్తించి గృహాలు మంజూరు చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరించేలా చొరవ తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించి అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలా రాణి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్, ఏపీవో నాగరాజు, గృహనిర్మాణ శాఖ ఏఈ సత్యనారాయణ, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పుట్టాలమ్మ ఆలయంలో హుండీ చోరీ



వాకాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిగుంటపాళెం గ్రామదేవత పుట్టాలమ్మ ఆలయంలో హుండీ చోరీ జరిగింది. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం తాళాలు పగలగొట్టి హుండీలో ఉన్న సుమారు లక్ష రూపాయల నగదు ఎత్తుకెళ్లారు. శనివారం ఆలయ ధర్మకర్త దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.